తెలుగు దినపత్రిక
RNI TG TEL/ 26/A0381
# సిరి
People's Voice
వార్త పత్రిక
10-07-2026
శుక్రవారం హైదరాబాద్
సంపుటి: (volume): 1
సంచిక: (ISSUE): 152
PUBLISHED FROM HYDERABAD పేజీలు-8 వెల:రూ.4 /–

తెలుగు దినపత్రిక
సిరి
People's Voice
RNI:TGTEL/26/A0381
siridailynews@gmail.com
/siridailynews
@siridailynews
విలేకరులు కావలెను
ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్ తో పాటు, అన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.
99897 78881, 7702344303, 9440451575

## మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టుకు రూ.7,345 కోట్ల ఆమోదం

- తొలి దశ పనులకు పరిపాలనా అనుమతి
- 21 కిలోమీటర్ల ప్రాధాన్య కారిడార్ అభివృద్ధి
- ఏడీబీ రుణంతో ప్రాజెక్టు అమలు
- ఈపీసీ విధానంలో పనులు చేపట్టనున్న ప్రభుత్వం

**హైదరాబాద్, జూలై 9, సిరి న్యూస్**
"హైదరాబాద్ నగర ప్రతిష్ఠను పెంచే మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు తొలి దశ పనులకు రూ.7,345.12 కోట్ల పరిపాలనా అనుమతి మంజూరు చేశాం. ప్రాజెక్టు అమలును వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించాం" అంటూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు

మిగతా 2వ పేజీలో..





## గురుకులాల్లో పార్ట్ టైం గందరగోళం

- ఆరు రోజులకే ఉద్యోగాల తొలగింపు!
- పని భారం బారెడు.. జీతం జానెడు!
- నిరుద్యోగుల జీవితాలతో అధికారుల చెలగాటం..
- న్యాయం చేయాలంటూ బాధితుల ఆవేదన

**హైదరాబాద్/ సిద్దిపేట, జూలై 9, సిరి న్యూస్:**
తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ విద్యా వ్యవస్థ రోజురోజుకూ దిగజారుతుండటంతో.. చేతిలో డిగ్రీలు పట్టుకుని ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగుల్లో ప్రభుత్వంపై నమ్మకం సన్నగిల్లుతోంది. రాష్ట్రంలో మెరుగైన విద్యను అందించేందుకు ఏర్పాటు చేసిన సాంఘిక సంక్షేమ గురుకులాల్లో విద్యా ప్రమాణాలు నానాటికీ పడిపోతున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రెగ్యులర్ ఉపాధ్యాయుల కొరత ఉండటంతో, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం పార్ట్ టైం అధ్యాపకుల నియామకాలకు తెరలేపింది. అయితే, ఈ నియామక ప్రక్రియ నిరుద్యోగుల జీవితాల్లో తీవ్ర నిరాశను, గందరగోళాన్ని మిగిల్చింది.

మిగతా 3వ పేజీలో..



# రైతు డిస్కమ్ కు రాజ్యాధికారమెప్పుడు?!

- ఉన్న డిస్కమ్ ల ఉద్యోగుల బదిలీ మార్గదర్శకాలు వెలువడేదెన్నడు?
- లైసెన్స్ లేకుండానే ఆస్తుల, ఉద్యోగుల బదిలీలు సాధ్యమా?
- రైతులతో చర్చించలేదు.. ఉద్యోగుల సలహాలు తీసుకోలేదు..
- అంతా లోపభూయిష్టమంటున్న విద్యుత్ నిపుణులు
- కమిటీలతో ఇస్తున్న సందేశం ఏంది?

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:**
తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ రంగాన్ని మరింత బలోపేతం చేస్తామని, రైతుల కోసమే ప్రత్యేక వ్యవస్థను తెస్తామని ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించిన 'రైతు డిస్కమ్' వ్యవహారం ఇప్పుడు తీవ్ర గందరగోళంలో పడింది. రైతులతో కనీస చర్చలు జరపకుండా, విద్యుత్ ఉద్యోగుల సలహాలు తీసుకోకుండా రూపొందించిన ఈ ప్రణాళిక అంతా లోపభూయిష్టమని ప్రజాస్వామ్యవాదులు, నిపుణులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. అసలు రైతు పేరు పెట్టినంత మాత్రాన ఇక్కడ కొత్తగా రైతుకు ఒనగూరే ప్రయోజనం ఏమీ లేదని.. ఉన్న వ్యవస్థను ముక్కలు చేసి ప్రారంభించిన ఈ ప్రయోగం ఇటు ముందుకు సాగక, అటు ఉన్న డిస్కమ్‌ల పాలనకు పెద్ద శాపంగా పరిణమించిందని క్షేత్రస్థాయి పరిశీలనలో తేలుతోంది.

**పాలకమండలి సరే.. లైసెన్స్ ఏది మరి?**
తెలంగాణలో ప్రస్తుతం సేవలు అందిస్తున్న టీజీఎస్పీడీసీఎల్, టీజీఎన్‌పీడీసీఎల్ లలోని ఉచిత వ్యవసాయ విద్యుత్ సర్వీసులను వేరు చేస్తూ కొత్తగా 'రైతు డిస్కమ్' ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం గతంలో జీవో విడుదల

మిగతా 2వ పేజీలో..



## కాంగ్రెస్ పార్టీ పని అయిపోయినట్లే

- రేవంత్ సొంత సర్వేలోనూ ఇదే తేలింది
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

02



## కమిషన్లతోనే కాలం వెళ్లదీస్తోన్న కాంగ్రెస్

- కాళేశ్వరం కూలితే గోదావరి జలాలు ఎలా వచ్చాయి?
- బీఆర్ఎస్‌పై బురద చల్లడమే లక్ష్యం
- సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు

03

## 9 రోజుల్లో రూ.9 వేల కోట్ల రైతు భరోసా

- రాష్ట్ర చరిత్రలోనే ఈ వేదిక అతిపెద్ద రైతు ఆశీర్వాద సభ
- కాంగ్రెస్ ప్రాజెక్టులు బాగున్నాయి
- బిఆర్ఎస్ ప్రాజెక్టులు కూలుతున్నాయి
- మెగా రైతు మేళాలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- పాల్గొన్న వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల
- 150 స్టాల్స్ ఏర్పాటు
- అంచనాలకు మించి రైతుల హాజరు

03



## ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి

- వాతావరణ శాఖ సూచనలను పరిగణనలోకి తీసుకోవాలి
- ప్రభుత్వం పూర్తి అప్రమత్తంగా ఉంది
- రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు
- మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి

02



## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో భాగస్వాములు కావాలి

- పరిశ్రమలు సామాజిక బాధ్యతతో ముందుకు రావాలి
- స్టీల్, సిమెంట్ ధరలు తగ్గించాలి
- మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్ బాబు విజ్ఞప్తి
- సానుకూలంగా స్పందించిన పరిశ్రమల యాజమాన్యాలు



02



## 1,500 కండక్టర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

- టెన్త్ మార్కులతోనే ఆర్టీసీలో ఉద్యోగం

03



## బండి సాయి భగీరథ్‌కు షరతులతో బెయిల్

- పోక్సో కేసులో తెలంగాణ హైకోర్టు ఉత్తర్వులు

02

## బీఆర్ఎస్ ఖాతాలోని రూ.1,400 కోట్లపై విచారణ జరపాలి

- ఆ నిధులు క్విడ్ ప్రోకో ద్వారానే వచ్చాయి
- ఆ డబ్బును తెలంగాణ ఉద్యమకారుల కుటుంబాలకు పంచాలి
- మళ్లీ బీఆర్ఎస్‌లో చేరే ప్రసక్తే లేదు: కవిత

**పెద్దపల్లి, జూలై 9, సిరి న్యూస్**
"బీఆర్ఎస్ పార్టీ బ్యాంకు ఖాతాలో ఉన్న రూ.1,400 కోట్ల నిధులు స్వచ్ఛమైనవి కావు. అవన్నీ క్విడ్ ప్రోకో ద్వారా వచ్చినవే. ఆ నిధులపై సమగ్ర విచారణ జరిపించి, ఆ డబ్బును తెలంగాణ ఉద్యమకారుల

మిగతా 3వ పేజీలో..



# రైతు డిస్కమ్ కు రాజ్యాధికారమెప్పుడు?!




మొదటిపేజీ తరువాయి

చేసింది. ఇందుకు సంబంధించిన పాలకమండలి నియామకం కూడా పూర్తయింది. టీజీఎస్పీడీసీఎల్ సీఎండీగా ఉన్న ముషారఫ్ అలీని ఈ కొత్త రైతు డిస్కమ్‌కు కూడా సీఎండీగా నియమించారు. అయితే, నియామకం జరిగి ఆరు నెలలు గడుస్తున్నా.. పాలకమండలి ఈఆర్‌సీ మీటింగ్ నిర్వహించడం తప్ప మరో అడుగు ముందుకు వేయలేకపోయింది. ఆస్తుల పంపిణీ, అప్పుల కేటాయింపు, ఉద్యోగుల బదిలీలకు సంబంధించిన లెక్కలన్నీ కేవలం కాగితాలకే పరిమితమయ్యాయి. ఇంతవరకు ఈ కొత్త సంస్థకు కనీసం విద్యుత్ నియంత్రణ మండలి నుండి అధికారిక లైసెన్స్ కూడా జారీ కాలేదు. దీంతో లైసెన్స్ లేని ఈ రైతు డిస్కమ్, ప్రస్తుతానికి 'పవర్ లేని ట్రాన్స్‌ఫార్మర్'లా నిరుపయోగంగా మారిపోయింది.

**ఆశపడ్డ ఉద్యోగులు ఆగం..**

కొత్తగా ఏర్పాటు కానున్న రైతు డిస్కమ్‌లోకి వస్తే ప్రమోషన్లు త్వరగా వస్తాయని నమ్మించడంతో.. రెండు డిస్కమ్‌ల నుండి ప్రభుత్వం ఆశించిన సంఖ్య కంటే ఎక్కువ మంది ఉద్యోగులు ఇక్కడికి వచ్చేందుకు ఆప్షన్లు (దరఖాస్తులు) ఇచ్చుకున్నారు. తీరా చూస్తే నెలలు గడుస్తున్నా లైసెన్స్ రాకపోవడంతో ఆశపడ్డోళ్లందరి పరిస్థితి ఇప్పుడు అగమ్యగోచరంగా మారింది. అసలు ఈ సంస్థ మనుగడ ఎలా సాధ్యమనే దానిపై నిపుణులే పెదవి విరుస్తున్నారు. ఎక్కడైనా విద్యుత్ సంస్థలు వ్యాపార విస్తరణలో భాగంగా, లాభాల కోసం కొత్త డిస్కమ్‌లను ఏర్పాటు చేస్తాయి. కానీ ఇక్కడ మాత్రం అప్పులే ఆస్తులుగా తీసుకుని, కొత్తగా ఎలాంటి ఆదాయ వనరులు లేని సంస్థను మళ్లీ అప్పులు తెచ్చి నడుపుతామనడం హాస్యాస్పదంగా ఉందని మేధావులు మండిపడుతున్నారు. ఈఆర్‌సీ నిర్వహించిన అభిప్రాయ సేకరణలో వచ్చిన ప్రశ్నలకు సమాధానం చెప్పే నాథుడే కరువయ్యాడు.

**బదిలీలకు గ్రహణం..**

కొత్త డిస్కమ్ సంగతి ఎలా ఉన్నా.. దీని ప్రభావం వల్ల ఉన్న రెండు డిస్కమ్‌లలోని ఉద్యోగుల రెగ్యులర్ బదిలీలకు పూర్తిగా గ్రహణం పట్టింది. కొత్త డిస్కమ్ ఏర్పాటు ప్రక్రియ పూర్తయ్యే వరకు రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ ఉద్యోగుల జనరల్ బదిలీలను పూర్తిగా నిలిపివేయాలని ఒక సీనియర్ ఐఏఎస్ అధికారి ఇచ్చిన సలహా, తీసుకున్న నిర్ణయం ఇప్పుడు ఉద్యోగ వర్గాల్లో తీవ్ర ఆగ్రహానికి దారి తీస్తోంది. ఆ అధికారి ఆలోచన వల్ల అటు రైతు డిస్కమ్ ముందుకు పడలేదు, ఇటు ఉన్న సంస్థల్లో రెండేళ్లకు పైగా ఒకే చోట పనిచేస్తూ బదిలీ మార్గదర్శకాల కోసం ఎదురుచూస్తున్న వేలాది మంది ఉద్యోగుల ఆశలపై నీళ్లు చల్లినట్లయింది. గందరగోళాన్ని తొలగించడంలో యాజమాన్యం కూడా చేతులెత్తేయడంతో సమస్య మరింత జటిలమైంది.

**అందరి అభిప్రాయం తీసుకుంటే ఈ గతి పట్టేది కాదు**

ప్రభుత్వం ఈ డిస్కమ్ రూపకల్పన బాధ్యతలను 'అంతా నా ఇష్టం' అంటూ వ్యవహరించిన సదరు సీనియర్ ఐఏఎస్ అధికారిని నమ్మి అప్పగించడమే ప్రస్తుత సంక్షోభానికి పరోక్ష కారణమనే అపవాదును మూటగట్టుకోవాల్సి వచ్చింది. ముందే విద్యుత్ నిపుణులు, ఉద్యోగ సంఘాలు, ప్రజాసంఘాలతో విస్తృతంగా చర్చించి, అందరి అభిప్రాయాలు తీసుకుని ఉంటే.. ఈఆర్‌సీ లైసెన్స్ ప్రక్రియ ఇంతగా నిలిచిపోయేది కాదని విద్యుత్ వర్గాలు అంటున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం క్షేత్రస్థాయి వాస్తవాలను పసిగట్టి, రైతు డిస్కమ్ పేరిట జరుగుతున్న ఆటంకాలను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే, ఎప్పుడెప్పుడా అని చాలా కాలంగా ఎదురుచూస్తున్న పాత డిస్కమ్‌ల ఉద్యోగుల బదిలీ మార్గదర్శకాలను వెంటనే విడుదల చేసి, బదిలీలకు పచ్చజెండా ఊపాలని విద్యుత్ ఉద్యోగ సంఘాలు సర్కారును గట్టిగా కోరుతున్నాయి.

## ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి

**హైదరాబాద్, జూలై 9, సిరి న్యూస్:**

ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని రైతాంగం సంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా నీటి లభ్యతకు అనుగుణమైన ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. రైతులు భారత వాతావరణ శాఖ విడుదల చేస్తున్న వర్షపాతం అంచనాలు, హెచ్చరికలు, సూచనలను తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకుని సాగు నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. వదంతులను నమ్మకుండా అధికార యంత్రాంగం, వ్యవసాయ శాస్త్రవేత్తలు ఇచ్చే మార్గదర్శకాలనే అనుసరించాలన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన ఎల్‌నినో పరిస్థితులు, వర్షపాతం, నీటి లభ్యత, వ్యవసాయ కార్యాచరణపై సచివాలయంలో గురువారం ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, నీటిపారుదల, వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి జిల్లా వారీ కార్యాచరణపై స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి జిల్లాలో వర్షపాతం, భూగర్భ జలాలు, రిజర్వాయర్లలో నీటి నిల్వలు, సాగునీటి లభ్యతను నిరంతరం సమీక్షించి, వాటికి అనుగుణంగానే పంటల ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. ఎక్కువ నీరు అవసరమయ్యే పంటలకు బదులు తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని, గ్రామ సభలు, రైతు వేదికలు, క్షేత్రస్థాయి అవగాహన కార్యక్రమాల ద్వారా రైతులకు విస్తృతంగా వివరించాలని సూచించారు. వాతావరణ శాఖ, వ్యవసాయ శాఖ, నీటిపారుదల శాఖల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేసి శాస్త్రీయ సమాచారాన్ని వేగంగా రైతులకు చేరవేయాలని చెప్పారు. ఏ ప్రాంతంలో ఏ పంట అనుకూలమో శాస్త్రవేత్తల సిఫారసుల ఆధారంగా రైతులకు స్పష్టమైన సలహాలు అందించాలని ఆదేశించారు. రిజర్వాయర్లలో ఉన్న వాస్తవ నీటి నిల్వలపై రైతులకు పారదర్శక సమాచారం అందించి, నీటి లభ్యతకు అనుగుణంగానే సాగు ప్రణాళికలు రూపొందించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో వర్షాలు ప్రారంభమైన వెంటనే శ్రీపాద ఎల్లంపల్లి సహా గోదావరి బేసిన్‌లోని ప్రధాన జలాశయాలను సమర్థవంతంగా నింపేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధంగా ఉంచాలని నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. విత్తనాలు, ఎరువులు సమృద్ధిగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ప్రభుత్వం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉందని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఎల్‌నీనో సవాళ్లను శాస్త్రీయ ప్రణాళికతో ఎదుర్కొని రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం అన్ని శాఖల సమన్వయంతో పనిచేస్తున్నదని పునరుద్ఘాటించారు. ఐటీ, పరిశ్రమల శాU మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, నీటిపారుదల శాఖ ప్రధాన కార్యదర్శి ఇ.శ్రీధర్, సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్, ఈఎన్‌సి రమేష్ బాబు, వ్యవసాయశాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్‌లు పాల్గొనగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజులు పాల్గొన్నారు.



## మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టుకు రూ.7,345 కోట్ల ఆమోదం

మొదటిపేజీ తరువాయి

తొలి దశలో చేపట్టనున్న అభివృద్ధి పనులకు భూసేకరణ వ్యయాన్ని మినహాయించి రూ.7,345.12 కోట్ల పరిపాలనా అనుమతి మంజూరైంది. ఈ నిధులతో ప్రాధాన్య కారిడార్లలో మౌలిక వసతుల అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ప్రాజెక్టు కింద మొత్తం 21 కిలోమీటర్ల ప్రాధాన్య ప్రాంతాన్ని అభివృద్ధి చేయనున్నారు. ఇందులో హిమాయత్ సాగర్ నుంచి బాపూఘాట్ వరకు 9.20 కిలోమీటర్లు, ఉస్మాన్ సాగర్ నుంచి బాపూఘాట్ వరకు 11.80 కిలోమీటర్ల మేర జోన్1ఏ, జోన్1బీ కారిడార్లలో పనులు చేపట్టేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ప్రాజెక్టు అమలుకు అవసరమైన నిధుల్లో రూ.4,500 కోట్లను ఆసియా అభివృద్ధి బ్యాంక్ (ఏడీబీ) రుణంగా అందించనుంది. మిగిలిన రూ.2,845.12 కోట్లను హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ), తెలంగాణ గ్లోబల్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీ) రుణాల ద్వారా సమకూర్చనున్నారు. మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధి పనులను ఈపీసీ (ఇంజనీరింగ్-ప్రొక్యూర్మెంట్-కన్‌స్ట్రక్షన్) విధానంలో చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రాజెక్టు అమలును పర్యవేక్షించేందుకు ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్ (పీఎంసీ) నియామకానికి కూడా ఆమోదం తెలిపింది. ప్రాజెక్టుకు సంబంధించిన టెండర్లు, కొనుగోలు ప్రక్రియ మొత్తం ఆసియా అభివృద్ధి బ్యాంక్ మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. అలాగే తదుపరి చర్యలను వేగవంతంగా చేపట్టి ప్రాజెక్టు అమలును ముందుకు తీసుకెళ్లాలని మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంఆర్‌డీసీఎల్)కు ఆదేశాలు జారీ చేసింది.

## బండి సాయి భగీరథ్‌కు షరతులతో బెయిల్

- **పోక్సో కేసులో తెలంగాణ హైకోర్టు ఉత్తర్వులు**
- **దర్యాప్తునకు పూర్తిగా సహకరించాలని ఆదేశం**
- **45 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ తర్వాత ఊరట**

**హైదరాబాద్, జూలై 9 , సిరి న్యూస్**

"పోక్సో కేసులో నిందితుడైన బండి సాయి భగీరథ్‌కు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తున్నాం. దర్యాప్తునకు పూర్తిగా సహకరించాలి" అంటూ తెలంగాణ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడు బండి సాయి భగీరథ్‌కు పోక్సో చట్టం కింద నమోదైన కేసులో గురువారం తెలంగాణ హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఈ సందర్భంగా దర్యాప్తు అధికారులతో పూర్తిగా సహకరించాలని న్యాయస్థానం స్పష్టం చేసింది.

ఒక మైనర్ బాలికకు సంబంధించిన ఘటనలో మే 8న పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో భగీరథ్‌పై పోక్సో కేసు నమోదైంది. అనంతరం మే 16న పోలీసులు అతడిని అరెస్ట్ చేయగా, అప్పటి నుంచి చర్లపల్లి జైలులో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నాడు. దాదాపు 45 రోజులుగా జైలులో ఉన్న భగీరథ్ బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించాడు.

బెయిల్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా భగీరథ్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ, అతడు విద్యార్థి అని, జైలులో ఉండటం వల్ల చదువుకు తీవ్ర నష్టం జరుగుతోందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. మరోవైపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ బెయిల్‌ను వ్యతిరేకిస్తూ, కేసు దర్యాప్తు కీలక దశలో ఉందని, నిందితుడిని విడుదల చేస్తే సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందని వాదించారు.

ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ కె. సుజన భగీరథ్‌కు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేశారు. కాగా, గతంలో బీబీఏ పరీక్షలకు హాజరయ్యేందుకు భగీరథ్‌కు తెలంగాణ హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే.

## కాంగ్రెస్ పార్టీ పని అయిపోయినట్లే

**హైదరాబాద్, జూలై 9 , సిరి న్యూస్:**

కాంగ్రెస్ పార్టీ సగం పదవీ కాలం ముగిసిన నేపథ్యంలో తన పాలనపైన, తన నాయకత్వంపైన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విస్తృత సర్వే చేయించుకున్నారని, అందులో ప్రజా వ్యతిరేకత చాలా స్పష్టంగా వ్యక్తమైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ నివాసంలో పార్టీ హైదరాబాద్ నేతలతో గురువారం జరిగిన ప్రత్యక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే బీఆరఎస్ సుమారు 78 సీట్లతో ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని ఆ సర్వేలో తేలిందన్నారు. రెండు మీడియా సంస్థలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఇంటెలిజెన్స్ విభాగాలు చేసిన ప్రజాభిప్రాయ సేకరణలోనూ ఇదే అంశం వ్యక్తమైందన్నారు.కేసీఆర్‌ను మరోసారి ముఖ్యమంత్రిగా చూడాలనుకుంటున్నామని ప్రజలు స్పష్టంగా తమ అభిప్రాయం తెల్చిచెప్పారన్నారు. సొంత సర్వేతోపాటు పలు సర్వేల్లో వ్యక్తమైన ప్రజా వ్యతిరేకతను చూసి తట్టుకోలేకనే మరోసారి ముఖ్యమంత్రి వారం రోజులుగా అడ్డగోలుగా మాట్లాడుతున్నారని ఆయన విమర్శించారు. గురువారం నిర్వహించారు. తన పాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు రేవంత్ అనేక అటెన్షన్ డైవర్షన్ పనులు చేస్తున్నారని, అందులో భాగంగానే కాళేశ్వరం నుంచి రైతుబంధు వరకు అన్నింటిపైన అడ్డగోలుగా అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఇచ్చిన గ్యారంటీలు, డిక్లరేషన్లు, 420 హామీల అమలులో పూర్తిగా విఫలమైనందువల్లనే రాష్ట్రంలోని సబ్బండ వర్గాలు కాంగ్రెస్ పాలనపై నమ్మకం కోల్పోయారన్నారు. దీంతో ఆ పార్టీకి ప్రత్యామ్నాయంగా □ ప్రజలు బీఆరఎస్ కావాలని కోరుకుంటున్నారని, బీజేపీ వంటి ఇతర పార్టీలకు ఏమాత్రం అవకాశం ఇవ్వడానికి సిద్ధంగా లేరని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ జారుడు బండపైన నిలబడిందని, ఇక పుంజుకునే అవకాశమే లేదని వ్యాఖ్యానించారు. ఎన్ని రకాల ప్రయత్నాలు చేసినా, ఎన్ని రకాల అబద్ధాలు చెప్పినా కాంగ్రెస్ పార్టీ ప్రజామోదం పొందడం అత్యంత కష్టమన్నారు.

**ఎస్ఐఆర్ కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించాలి**

జీహెచ్ఎంసీ పరిధిలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించాలని కేటీఆర్ పార్టీ నేతలకు సూచించారు. ప్రభుత్వం, ఎలక్షన్ కమిషన్ నియమించిన బూత్ లెవెల్ ఆఫీసర్లకు సరైన శిక్షణ, తగిన ఏర్పాట్లు లేకపోవడంతో ఈ కార్యక్రమం అత్యంత మందకొడిగా కొనసాగుతున్నదని, దీనివల్ల ప్రజలకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నట్లు ఫీడ్‌బ్యాక్ వస్తోందని చెప్పారు. ముఖ్యంగా హైదరాబాద్ వంటి అత్యధిక జనసాంద్రత ఉండే మహానగరంలో ఈ కార్యక్రమానికి సంబంధించిన ఫారాల పంపిణీ, వాటిలో ఓటర్ల నమోదు వంటి అంశాలపై సరైన అవగాహన లేకుండానే అధికారులను కేటాయించారంటూ పార్టీ వర్గాలు ఇస్తున్న ఫీడ్‌బ్యాక్‌ను ప్రస్తావించారు. అయితే ఎస్ఐఆర్ అత్యంత కీలకమైన అంశమని, ఒక వ్యక్తికి ఒకే ఓటు ఉండాలన్న రాజ్యాంగ స్ఫూర్తి ఆధారంగా దొంగ ఓట్లు లేకుండా చూడాలని కోరారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక సందర్భంగా భారీగా బయటపడిన డబుల్ ఓట్లు, దొంగ ఓట్ల వ్యవహారాన్ని ప్రతి ఒక్క నాయకుడు గుర్తుంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఎసఐఆర్‌కు సంబంధించి పార్టీ నియమించుకున్న బూత్ లెవెల్ అసిస్టెంట్ల(బీఎల్ఏ) సహకారంతో ఏ ఒక్కరి ఓటు పోకుండా చూడాలన్నారు. బీజేపీ, కాంగ్రెస్‌లు అధికారంలో ఉన్నందున డబుల్ ఓట్ల నమోదు లేదా ఇతర ప్రాంతాల వారిని ఆయా నియోజకవర్గాల్లో ఓటర్లుగా నమోదు చేయించే ప్రయత్నాలు చేస్తున్నాయని, ఇలాంటి సందర్భంలో కార్యకర్తలు, మద్దతుదారుల ఓట్లు పోయేలా ప్రయత్నం చేసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కాబట్టి ప్రతి ఒక్కరి ఓటు నమోదయ్యేలా చూడాలని, ఏ ఒక్కరి ఓటు అన్యాయంగా తొలగింపునకు గురికాకుండా చూడాలన్నారు. దీంతోపాటు ఆయా నియోజకవర్గాల్లో ఉన్న డబుల్ ఓట్లపై పార్టీ శ్రేణులు దృష్టి సారించాలన్నారు. మరోవైపు ఎసఐఆర్ కు సంబంధించిన అంశంలో ఎదురవుతున్న ఇబ్బందులను, ప్రజల నుంచి వస్తున్న ఫీడ్‌బ్యాక్‌ను ఎలక్షన్ కమిషన్ దృష్టికి ఎప్పటికప్పుడు పార్టీ తరపున తీసుకుపోతున్నట్లు తెలిపారు. నగరంలో ఎసఐఆర్‌కు సంబంధించి స్థానిక ఎమ్మెల్యేలు మరింత చురుగ్గా ముందుకు పోవాలన్నారు. ప్రతి ఒక్క ఎమ్మెల్యే, స్థానిక కార్యకర్తలు, పార్టీ బూత్ లెవెల్ అసిస్టెంట్లతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. జీహెచఎంసీ పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో ఒలింపిక్స్ నిర్వహణే నా కల

- **క్రీడా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది**
- **యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ, వెబ్‌సైట్ ప్రారంభం**
- **నవంబర్‌లో ఖేలో ఇండియా గేమ్స్‌కు తెలంగాణ ఆతిథ్యం**
- **ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్, జూలై 9, సిరి న్యూస్**

"హైదరాబాద్ వేదికగా ఒలింపిక్స్ నిర్వహించడమే నా కల. క్రీడాకారులకు ప్రపంచస్థాయి మౌలిక వసతులు కల్పించి తెలంగాణను దేశంలోనే అగ్ర క్రీడా రాష్ట్రంగా తీర్చిదిద్దుతాం" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.

హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీతో పాటు గచ్చిబౌలి స్పోర్ట్స్ డిస్ట్రిక్ట్‌ను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు పీటీ ఉషతో కలిసి యూనివర్సిటీ లోగో, వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు.

హైదరాబాద్‌ను మరోసారి జాతీయ, అంతర్జాతీయ క్రీడలకు కేంద్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి తెలిపారు. 1990 నుంచి 2004 వరకు హైదరాబాద్ అనేక అంతర్జాతీయ క్రీడా పోటీలకు ఆతిథ్యం ఇచ్చిందని, అయితే గత రెండు దశాబ్దాలుగా ఆ స్థాయి పోటీలు జరగలేదని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా క్రీడలను ప్రోత్సహించేందుకు సమగ్ర క్రీడా విధానాన్ని రూపొందించామని రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఇందులో భాగంగా వచ్చే నవంబర్‌లో ఖేలో ఇండియా గేమ్స్‌కు తెలంగాణ ఆతిథ్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. అపార జనాభా ఉన్న భారత్ ఒలింపిక్స్‌లో ఆశించిన స్థాయిలో పతకాలు సాధించకపోవడం ఆందోళనకరమని ఆయన అన్నారు. చిన్న వయసులోనే ప్రతిభావంతులను గుర్తించి అంతర్జాతీయ ప్రమాణాలతో శిక్షణ అందిస్తే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని అభిప్రాయపడ్డారు. చదువుతో పాటు క్రీడలు కూడా యువతకు ఉజ్వల భవిష్యత్తు, ఉపాధి అవకాశాలను కల్పిస్తాయని పేర్కొన్నారు. 2036 ఒలింపిక్స్‌కు హైదరాబాద్ తరపున బిడ్ దాఖలు చేయడం లేదా భారత్‌కు ఆతిథ్య అవకాశం లభిస్తే కనీసం కొన్ని క్రీడా విభాగాలను హైదరాబాద్‌లో నిర్వహించాలన్నదే తమ లక్ష్యమని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఈ దిశగా గచ్చిబౌలి క్రీడా మౌలిక వసతుల ఆధునికీకరణ, నూతన స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు వంటి చర్యలు చేపడుతున్నామని చెప్పారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో భాగస్వాములు కావాలి

**హైదరాబాద్, జూలై 9, సిరి న్యూస్:**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేద ప్రజల సొంతింటి కలను సాకారం చేయాలనే సంకల్పంతో ప్రజాప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో స్టీల్ , సిమెంట్ పరిశ్రమలు భాగస్వాములు కావాలని రెవెన్యూ, హౌసింగ్, సమాచార & పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ,రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు విజ్ఞప్తి చేశారు. సచివాలయంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అవసరమైన స్టీల్, సిమెంట్ తదితర నిర్మాణ సామగ్రి ధరలు, సరఫరా, పరిశ్రమల సహకారం అంశాలపై ఆయా పరిశ్రమల యాజమాన్యాలతో గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం కేవలం గృహ నిర్మాణ కార్యక్రమం మాత్రమే కాదని, పేద కుటుంబాలకు గౌరవప్రదమైన జీవితం, సామాజిక భద్రత, ఆత్మగౌరవాన్ని కల్పించే మహాయజ్ఞమని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా (హైదరాబాద్ మినహా) మొదటి విడతలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. వీటిలో ఇప్పటికే గణనీయ సంఖ్యలో 85 శాతం ఇళ్ల శ్లాబులు పూర్తయ్యాయని, మిగిలిన 15 శాతం ఇళ్లు వివిధ నిర్మాణ దశల్లో వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. రెండో విడతలో నియోజకవర్గానికి రెండు వేల చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా రెండున్నర లక్షల ఇళ్లు మంజూరు , అలాగే క్యూర్ పరిధిలో లక్ష ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకొని కార్యాచరణ చేపట్టిందన్నారు. గిరిజన నియోజకవర్గాల్లో అదనంగా వెయ్యి నుంచి 1500 ఇళ్లు మంజూరు చేస్తున్నాం. ఇళ్ల మంజూరు నిరంతర ప్రక్రియ. మూడు, నాలుగవ విడతల్లో కూడా ఇళ్లను మంజూరు చేస్తామన్నారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా 100 శాతం సబ్సిడీతో రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తూ ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టడం లేదని, ఈ విషయంలో తెలంగాణ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు.ప్రభుత్వంపై ఎంతటి ఆర్థిక భారం పడినా పేదల ఇళ్ల నిర్మాణంలో ఎలాంటి రాజీ పడకుండా ప్రతి లబ్ధిదారుడికి నిర్మాణ పురోగతికి అనుగుణంగా విడతల వారీగా ప్రతి సోమవారం పారదర్శకంగా నిధులను విడుదల చేస్తున్నామని తెలిపారు. ప్రతి పేద కుటుంబం సొంత ఇంటిలో నివసించే వరకు ప్రభుత్వం తన బాధ్యతను పూర్తి నిబద్ధతతో నిర్వర్తిస్తుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ బృహత్తరమైన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో స్టీల్, సిమెంట్ పరిశ్రమల యాజమాన్యాలు కూడా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఇందిరమ్మ ఇళ్లకు అవసరమైన స్టీల్, సిమెంట్‌ను తక్కువ ధరకే అందించాలని మంత్రులు చేసిన విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించారు. ప్రభుత్వం-పరిశ్రమలు-ప్రజలు కలిసి పనిచేస్తే తెలంగాణలో గుడిసెలు లేని రాష్ట్రం లక్ష్యాన్ని త్వరితగతిన సాధించవచ్చని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ఒక ప్రజా ఉద్యమంగా మార్చేందుకు ప్రతి వర్గం సహకారం అందించాలని మంత్రులు పిలుపునిచ్చారు. పేదవాడికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహాయమందిస్తే ప్రభుత్వంతో పాటు పరిశ్రమల యాజమాన్యాలను కూడా చిరస్థాయిగా గుర్తుపెట్టుకుంటారని అన్నారు. పరిశ్రమలు, హౌసింగ్ అధికారులు ఆయా పరిశ్రమల యాజమాన్యాలతో సమన్వయం చేసుకొని లబ్దిదారునికి ఏవిధంగా మెటీరియల్ చేరవేయాలన్న దానిపై రూట్ మ్యాప్ తయారు చేయాలని మంత్రులు సూచించారు. సమావేశంలో పరిశ్రమల యాజమాన్యాలతోపాటు హౌసింగ్ సెక్రటరీ వి.పి.గౌతమ్, పరిశ్రమల శాఖ స్పెషల్ సెక్రటరీ కృష్ణాదిత్య, టీజీఐఐసీ ఎండీ శశాంక తదితరులు పాల్గొన్నారు.

# 9 రోజుల్లో రూ.9 వేల కోట్ల రైతు భరోసా

చింతకాని/ఖమ్మం, జూలై 9, సిరి న్యూస్ :

రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్టేట్ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. చింతకాని మండలం మత్కేపల్లి క్రాస్ రోడ్ క్రాస్ రోడ్, జగన్నాధపురం గ్రామంలో గురువారం నిర్వహించిన మెగా రైతు మేళాకు రైతులు విశేషంగా తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి , వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ మంత్రివర్గం రైతుల అవసరాలు, వ్యవసాయ రంగ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక శ్రద్ధతో పనిచేస్తోందన్నారు. విత్తనం వేసినప్పటి నుంచి పంట కొనుగోలు వరకు ప్రతి దశలో రైతులకు ప్రభుత్వం అండగా ఉంటోందని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నామని తెలిపారు. రైతు సంక్షేమంపై ప్రతిపక్షాలు అనవసర విమర్శలు చేస్తున్నాయని, తమ ప్రభుత్వం మాటలకు పరిమితం కాకుండా చేతల్లో చూపించే ప్రభుత్వమని అన్నారు. దశాబ్దాల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వాలు నిర్మించిన నాగార్జున సాగర్, శ్రీరాం సాగర్, కడెం వంటి సాగునీటి ప్రాజెక్టులు నేటికీ రైతులకు నీరందిస్తున్నాయని, గత ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం కుంగిపోవడం ఆ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని విమర్శించారు. ఖమ్మం జిల్లాలో ప్రతి కుటుంబానికి వ్యవసాయంతో అనుబంధం ఉందని, అందుకే ఇక్కడ రైతు ఆశీర్వాద సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కేవలం 9 రోజుల్లో రూ.9 వేల కోట్ల రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసిన ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వమేనన్నారు. ప్రభుత్వానికి అనేక సమస్యలు ఉన్నప్పటికీ ధాన్యం, మొక్కజొన్న తదితర పంటలను మద్దతు ధరకు కొనుగోలు చేశామని తెలిపారు. వ్యవసాయ ఆధునికీకరణ కోసం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామని, ఖమ్మం నుంచి ఆదిలాబాద్ వరకు ప్రతి జిల్లాలో ఆయిల్‌పామ్ సాగును విస్తరిస్తున్నామని తెలిపారు. రైతులు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రత్యామ్నాయ పంటలపై శాస్త్రవేత్తలతో నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. జూలై 10న జరిగే రైతు ఆశీర్వాద సభకు ముఖ్యమంత్రి సహా తెలంగాణ మంత్రివర్గం మొత్తం హాజరవుతుందని అన్నారు. ప్రస్తుతం రైతులకు అందుతున్న ప్రతి నీటి చుక్క కాంగ్రెస్ ప్రభుత్వాలు నిర్మించిన సాగునీటి ప్రాజెక్టుల ద్వారానే వస్తోందని తెలిపారు. రైతులను మాయమాటలతో మోసం చేసే పార్టీలకు ప్రజలు అవకాశం ఇవ్వబోరని అన్నారు. రైతు సంక్షేమానికి పునాదులు వేసిన ప్రభుత్వాలను రైతులే కాపాడుకుంటారని, ప్రతిపక్షాలు ప్రచారం చేస్తున్న అబద్ధాలను ప్రజలు నమ్మరని పేర్కొన్నారు. చింతకాని మండలంలో మూడు లక్షల మంది రైతులతో భారీ రైతు ఆశీర్వాద సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. వ్యవసాయ రంగంలో వస్తున్న ఆధునిక మార్పులను రైతులకు అందించాలనే లక్ష్యంతో స్టాల్స్ ఏర్పాటు చేశామని చెప్పారు. రైతుల అభివృద్ధికి అవసరమైన ప్రతి కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపడుతుందని, శాస్త్రవేత్తలు చెప్పే అంశాలను రైతులు శ్రద్ధగా విని గ్రామాలకు తీసుకెళ్లాలని కోరారు. ఆధునిక సాగు పద్ధతులు, ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు దృష్టి సారించాలని సూచించారు. వ్యవసాయంతో పాటు ఫిషరీస్, హార్టికల్చర్ తదితర అనుబంధ రంగాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని డిప్యూటీ సీఎం తెలిపారు.

**మద్దతు ధరకు పంట ఉత్పత్తుల కొనుగోలు**

మంత్రి తుమ్మల మాట్లాడుతూ జూన్ 30న నిర్వహించాల్సిన రైతు ఆశీర్వాద సభ వర్షాల కారణంగా జూలై 10వ తేదీకి వాయిదా పడిందన్నారు. రాష్ట్ర చరిత్రలోనే అతిపెద్ద రైతు సభను చింతకాని మండలంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు సకాలంలో కురవడం లేదని, ఈ ఏడాది నీటి సమస్యలు తలెత్తే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు ఎలా వ్యవసాయం చేయాలనే అంశాలపై వ్యవసాయ శాఖ శాస్త్రీయ సూచనలు అందిస్తోందన్నారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వైరా ప్రాజెక్టుకు గోదావరి జలాలు అందించాలని చేసిన విజ్ఞప్తికి డిప్యూటీ సీఎం సానుకూలంగా స్పందించారని తెలిపారు. సీతారామ ఎత్తిపోతల పథకాన్ని వినియోగించుకుంటూ రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా గోదావరి జలాలను వైరా ప్రాజెక్టుకు తరలిస్తున్నామని, దీంతో వర్షాలతో సంబంధం లేకుండా దాదాపు లక్ష ఎకరాలకు సాగునీరు అందుతుందని చెప్పారు. తక్కువ కాలంలో, తక్కువ నీటితో పండే పంటలను రైతులు సాగు చేయాలని సూచించారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం మొక్కజొన్నను కొనుగోలు చేయలేదని, రైతులు నష్టపోకుండా ఉండేందుకు డిప్యూటీ సీఎం రూ.5 వేల కోట్లు కేటాయించి మద్దతు ధరకు మొక్కజొన్న కొనుగోలు చేశారని తెలిపారు. మొక్కజొన్నతో పాటు జొన్న, సోయా తదితర పంటలను కూడా మద్దతు ధరకు కొనుగోలు చేసిన ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వమేనన్నారు. మొక్కజొన్న విక్రయించిన రైతుల ఖాతాల్లో మద్దతు ధర చెల్లింపులు రేపటిలోగా జమ చేస్తామని స్పష్టం చేశారు. జూలై 10న జరిగే రైతు ఆశీర్వాద సభ చారిత్రక ఘట్టమని, రైతులకు అవసరమైన ప్రతి సహాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొనే రైతు ఆశీర్వాద సభకు లక్షలాది మంది రైతులు హాజరై విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఉద్యమాలు, పోరాటాలు, వ్యవసాయ రంగంలో ఖమ్మం జిల్లాకు ఘన చరిత్ర ఉందని, జిల్లాలో అత్యధికంగా ఆయిల్‌పామ్ సాగు జరుగుతోందన్నారు. సంప్రదాయ పంటలతోపాటు ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు దృష్టి సారించాలని, అధిక ఆదాయం వచ్చే పంటలను సాగు చేయాలని సూచించారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల ద్వారా వచ్చే వేతనం కంటే ఆయిల్‌పామ్ సాగుతో అధిక ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం, ప్రకృతి సహకరించక పోయినా రైతు సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నారని తెలిపారు. రైతులకు అవసరమైన యూరియాను కేంద్ర ప్రభుత్వంతో చర్చించి సమకూరుస్తున్నామని, యూరియా యాప్ ద్వారా అవసరమైన మేరకే కొనుగోలు చేయాలని సూచించారు. యూరియా యాప్ వల్ల దుర్వినియోగానికి అవకాశం లేకుండా పోయిందన్నారు. రైతులకు వాతావరణ పరిస్థితులు, వర్షాభావ పరిస్థితులపై ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తున్నామని, మార్కెట్లో డిమాండ్ ఉన్న వరి విత్తనాలను అందుబాటులో ఉంచామని తెలిపారు. ప్రపంచంలో ఉన్న అత్యాధునిక వ్యవసాయ సాంకేతికతను రైతులకు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మెగా రైతు మేళా, రైతు ఆశీర్వాద సభ నిర్వహణకు అద్భుతమైన ఏర్పాట్లు చేసిన జిల్లా యంత్రాంగం, అధికారులు, సిబ్బందిని మంత్రి అభినందించారు.

**పంట మార్పిడి విధానం**

వ్యవసాయ శాఖ సంచాలకుడు గోపి మాట్లాడుతూ వ్యవసాయం, అనుబంధ రంగాల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలను రైతులకు వివరించేందుకు ఈ మెగా రైతు మేళా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆదర్శ రైతులు అనుసరిస్తున్న వ్యవసాయ విధానాలను ఇతర రైతులకు పరిచయం చేయడం కూడా ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. పంట మార్పిడి విధానం అమలు చేయడం, ఎరువుల వినియోగాన్ని తగ్గించడం, మార్కెట్లో డిమాండ్ ఉన్న పంటల సాగు, ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ మెగా రైతు మేళా కోసం మొత్తం 150 స్టాల్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వ్యవసాయ శాఖతోపాటు హార్టికల్చర్, ఫిషరీస్, పశుసంవర్ధక శాఖలు సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మెగా రైతు మేళాకు 5 వేల మంది రైతులు వస్తారని అంచనా వేయగా దాదాపు 11 వేల మంది రైతులు హాజరయ్యారని తెలిపారు. రైతుల కోసం ఆధునిక వ్యవసాయ యంత్రాలు, సాంకేతిక పరికరాలను ప్రదర్శనకు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. తక్కువ వ్యయంతో అధిక దిగుబడులు ఎలా సాధించాలి, ఆధునిక సాంకేతికతను వ్యవసాయ రంగంలో ఎలా వినియోగించుకోవాలి అనే అంశాలపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పిస్తారని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ 'రైతు ఆశీర్వాదం' సభకు రైతులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, జిల్లా వ్యవసాయ అధికారి, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మరోమారు కలవర పెడుతున్న కోవిడ్

- **రాజంపేటకు చెందిన వ్యక్తి కోవిడ్‌తో మృతి**
- **అప్రమత్తం అయిన వైద్యారోగ్య శాఖ**

తిరుపతి, జూలై 9, సిరి న్యూస్:

కోవిడ్ మహమ్మారి మరోమారు కలవర పెడుతోంది. ఏపీలోని కడప జిల్లా రాజంపేటకు చెందిన ఒక వ్యక్తి(52) కొవిడ్ కారణంగా చనిపోవడంతో వైద్యశాఖ అప్రమత్తమైంది. అన్ని జిల్లాల్లో ఆరా తీయగా కడప, తిరుపతి జిల్లాల్లో 5 కొవిడ్ పాజిటివ్ కేసులు నమోదైనట్టు గుర్తించింది. దీంతో మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ (డీఎంఈ) రాష్ట్రంలోని ప్రధాన ప్రభుత్వ ఆస్పత్రుల సూపరింటెండెంట్లకు లేఖలు రాశారు. కొవిడ్ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని, ఆస్పత్రుల్లో అందుబాటులో ఉన్న ఐసోలేషన్ బెడ్లు, ఐసీయూ పడకలు, ఆక్సిజన్ సౌకర్యం, వెంటిలేటర్లు, మందులు, ర్యాపిడ్ కిట్లు, అంబులెన్స్ వంటి వైద్య సిబ్బంది వివరాలతో నివేదిక పంపాలని ఆదేశించారు. ఇటీవల నమోదైన కేసుల నేపథ్యంలో అవసరమైతే వెంటనే చికిత్స అందించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధంగా ఉంచాలని వైద్యాధికారులకు సూచించినట్టు సమాచారం. రాజంపేటకు చెందిన వ్యక్తి తీవ్రమైన ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతూ గత నెల 24న వేలూరు సీఎంసీలో చికిత్స నిమిత్తం చేరారు. న్యుమోనియా వ్యాధిని గుర్తించారు. అనుమానంతో కొవిడ్ పరీక్ష చేయగా 26వ తేది పాజిటివ్ వచ్చింది. చికిత్స పొందుతూ 28న మృతిచెందడంతో వైద్య శాఖ అప్రమత్త మైంది. కొవిడ్ పాజిటివ్ కేసులు నమోదైన నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని డీఎంఈ ఆదేశాలిచ్చారు. రుయాలో కొవిడ్ ఐసోలేషన్ వార్డు ఏర్పాటు చేశాం.. కొవిడ్ టెస్ట్ కిట్లు, సిబ్బంది, అవసరమైన మందులతో సిద్ధంగా ఉన్నాం.. రుయాలో ఇప్పటివరకు ఎలాంటి కేసులు నమోదు కాలేదు.. ప్రస్తుతం నమోదైన కేసుల్లో తీవ్రమైన లక్షణాలు లేవని, అయినప్పటికీ అప్రమత్తంగా ఉండాలని భావిస్తున్నాం అని డీఎంఈ వివరించారు. గతంలోలాగా భయపడాల్సిన పనిలేదని భరోసా ఇచ్చారు. వాతావరణంలో మార్పుల కారణంగా రోగనిరోధక శక్తి తగ్గినవారు అశ్రద్ధ చేయకూడదని, జ్వరం, దగ్గు, గొంతునొప్పి వంటి లక్షణాలుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని. వృద్ధులు, గర్భిణులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## బస్తీ దవాఖానాల తనిఖీలకు ప్రత్యేక అధికారులు

- **వర్షాకాలం నేపథ్యంలో మెరుగైన వైద్య సేవలే లక్ష్యం**
- **హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం**

హైదరాబాద్, జూలై 9, సిరి న్యూస్ :

హైదరాబాద్ జిల్లా పరిధిలోని 169 బస్తీ దవాఖానల పనితీరు, ప్రజలకు అందుతున్న వైద్య సేవల నాణ్యతను ఈనెల 10వ తేదీన క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ఈ తనిఖీలను సమన్వయం చేస్తూ తనతోపాటు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా రాబోయే రెండు మూడు రోజులపాటు ఎంపిక చేసిన ముఖ్యమైన బస్తీ దవాఖానలను స్వయంగా తనిఖీలు చేస్తామని తెలిపారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాలు వంటి సీజనల్ వ్యాధులను సమర్థవంతంగా నివారించేందుకు బస్తీ దవాఖానలను మరింత బలోపేతం చేయడం, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవడమే ఈ ప్రత్యేక పర్యవేక్షణ ప్రధాన ఉద్దేశమని మంత్రి తెలిపారు. బస్తీ దవాఖానల్లో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటూ వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, అలాగే మందుల నిల్వలు, ప్రయోగశాల సేవలు, పరిశుభ్రత, అవసరమైన మౌలిక వసతులు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి లోపాలను వెంటనే సరిదిద్దేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో, నాణ్యమైన ప్రాథమిక వైద్య సేవలు అందించడంలో బస్తీ దవాఖానలు కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. వర్షాకాలంలో ప్రజల ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి బస్తీ దవాఖాన ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా పనిచేయాలని సూచించారు. జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో తమ పరిధిలో ఉన్న బస్తీ దవాఖానలను స్థానిక ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, కార్పొరేటర్లు అలాగే ఇతర ప్రజాప్రతినిధులు విధిగా సందర్శించి అక్కడి పరిస్థితులను సమీక్షిస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా అధికారులతో సమన్వయం చేసుకోవాలని పిలుపునిచ్చారు. బస్తీ దవాఖానలను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు నిరంతరం కొనసాగిస్తుందని మంత్రి పొన్నం స్పష్టం చేశారు.

# గురుకులాల్లో 'పార్ట్ టైం' గందరగోళం

మొదటిపేజీ తరువాయి

రహస్యంగా ఖాళీలు.. డెమోల పేరిట హడావుడి

202627 విద్యా సంవత్సరానికి గానూ జూన్ నెలలో సాంఘిక సంక్షేమ గురుకులాల్లో పార్ట్ టైం ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశారు. సిద్దిపేట జిల్లాకు సంబంధించి వేలాది మంది అభ్యర్థులు హుస్నాబాద్ లోని సాంఘిక సంక్షేమ గురుకులంలో తమ దరఖాస్తులు సమర్పించారు. జూన్ 27న మిట్టపల్లి సీఈఓ (CEO) కార్యాలయంలో డెమో క్లాసులు ఉంటాయని ప్రకటించడంతో వేలాదిగా నిరుద్యోగులు తరలివచ్చారు.

అయితే, ఎక్కడెక్కడ ఎన్ని ఖాళీలు ఉన్నాయనే సమాచారాన్ని గురుకుల అధికారులు ఉద్దేశపూర్వకంగా దాచిపెట్టారనే ఆరోపణలు వస్తున్నాయి. కొన్ని పోస్టులు లేవని అధికారులు చెప్పడంతో అభ్యర్థులు ప్రశ్నించారు. దీనిపై స్పందించిన అధికారులు.. అన్ని పోస్టులకు డెమోలు నిర్వహిస్తామని ప్రకటించినప్పటికీ, ఖాళీల వివరాలను మాత్రం వెల్లడించకపోవడం వెనుక ఆంతర్యమేమిటో ఎవరికీ అర్థం కావడం లేదు.

**మాట తప్పిన జీతాలు..**

**ప్రిన్సిపాల్స్ నిర్లక్ష్య సమాధానాలు**

నోటిఫికేషన్ ప్రకటనలో జూనియర్ లెక్చరర్ (JL) పోస్టుకు రూ. 23,000, పీజీటీ (PGT) మరియు టీజీటీ (TGT) ఉద్యోగాలకు రూ. 18,200 జీతం ఇస్తామని పేర్కొన్నారు. తీరా డెమోల్లో ఎంపికై, స్కూళ్లలో జాయినింగ్ రిపోర్ట్ ఇచ్చేందుకు వెళ్లిన అభ్యర్థులకు ప్రిన్సిపాల్స్ షాక్ ఇచ్చారు.

"మీ స్కూల్లో పోస్ట్ ఖాళీ లేదు.. అయినా తీసుకుంటున్నాం కాబట్టి రూ. 15,000 మాత్రమే ఇస్తాం. ఇష్టముంటే చేయండి, లేదంటే వెళ్ళిపోండి" అంటూ కొందరు ప్రిన్సిపాల్స్ ముఖం మీదే నిర్లక్ష్యంగా సమాధానం చెప్పినట్లు బాధితులు వాపోతున్నారు.

సూపర్‌విజన్ డ్యూటీలు, సెల్ఫ్ స్టడీ, నైట్ స్టేలు, హాలిడే, లంచ్ డ్యూటీల పేరిట గొడ్డు చాకిరీ చేయించుకుంటూ.. కేవలం రూ. 15,000 నుండి రూ. 16,000 మాత్రమే ఇస్తామనడంపై అభ్యర్థులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హిందీ టీజీటీ పోస్టులకు సంబంధించి ప్రభుత్వం ప్రత్యేక సర్క్యులర్ ఇచ్చినప్పటికీ.. 'వర్క్ లోడ్ లేదు' అనే సాకుతో కేవలం రూ. 15,000 మాత్రమే ఇస్తామని తెగేసి చెబుతున్నట్లు సమాచారం.

**ఆరు రోజుల ముచ్చటేనా? నియామకాల రద్దు!**

గత శుక్రవారం ఎన్నో ఆశలతో విధుల్లో చేరిన కొత్త అభ్యర్థుల ఆనందం పట్టుమని పది రోజులు కూడా నిలవలేదు. నియామక ప్రక్రియలో అన్యాయం జరిగిందంటూ కొందరు అభ్యర్థులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో.. అధికారులు ఏకంగా ఈ నియామక ప్రక్రియనే రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఆరు రోజులుగా పాఠశాలలకు వెళ్తూ విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులను.. బుధవారం నాడు ఒక్కసారిగా స్కూల్ నుండి వెళ్ళిపోవాలని ప్రిన్సిపాల్స్ ఆదేశించారు. తదుపరి ప్రక్రియను త్వరలోనే పేపర్ ప్రకటన ద్వారా తెలియజేస్తామని, మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని చెప్పడంతో అభ్యర్థులు లబోదిబోమంటున్నారు.

**కలెక్టర్ పర్యవేక్షణలోనే ఇలాగైతే ఎలా?**

గురుకుల పార్ట్ టైమ్ ఉద్యోగుల నియామకాలు కలెక్టర్ స్థాయి పర్యవేక్షణలో జరిగినప్పటికీ.. ఇలా అర్థాంతరంగా రద్దు చేయడంపై నిరుద్యోగులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని జిల్లాల్లో డెమోలను మధ్యలోనే నిలిపివేయగా, సిద్దిపేట లాంటి జిల్లాల్లో నియామకాలు పూర్తి చేసి, విధుల్లో చేరిన వారిని తొలగించడం దారుణమని మండిపడుతున్నారు. తమ ఆశలతో, జీవితాలతో ఆడుకునే హక్కు అధికారులకు, ప్రభుత్వానికి ఎవరిచ్చారని బాధితులు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, విధుల్లో చేరిన పార్ట్ టైం ఉద్యోగులను యథావిధిగా కొనసాగించాలని, నోటిఫికేషన్‌లో ప్రకటించిన విధంగానే టీజీటీ, పీజీటీలకు రూ. 18,200, జేఎల్స్ కి రూ. 23,000 వేతనం అందించి న్యాయం చేయాలని నిరుద్యోగులు వేడుకుంటున్నారు.

## కమిషన్లతోనే కాలం వెళ్లదీస్తోన్న కాంగ్రెస్

సిద్దిపేట, జూలై 9, సిరి న్యూస్:

కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయిందని కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న వ్యాఖ్యలు వాస్తవాలకు విరుద్ధమని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు అన్నారు. కాళేశ్వరం నుంచి వచ్చే గోదావరి జలాలు ప్రజలందరికీ కనిపిస్తున్నప్పటికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాత్రం ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు. గురువారం సిద్దిపేటలోని పటేల్ గార్డెన్‌లో సిద్దిపేట లారీ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ అసోసియేషన్ సభ్యుల కోసం ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో పాల్గొని ఆయన మాట్లాడారు. కాళేశ్వరం కూలిపోయిందంటూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని, రాజకీయంగా బీఆర్‌ఎస్‌ను దెబ్బతీయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యంగా మారిందని హరీశ్ రావు విమర్శించారు.సిద్దిపేట జిల్లాలో కాళేశ్వరం జలాలతోనే విస్తారంగా సాగు జరిగి, ధాన్యం ఉత్పత్తి పెరిగిందన్నారు. గోదాములు నిండిపోయి ధాన్యం తరలించేందుకు లారీలు కూడా దొరకని పరిస్థితి నెలకొందని చెప్పారు.గురుకులాల్లో కోడిగుడ్లు, బూట్లు, యూనిఫాంల నుంచి రవాణా శాఖలో రేడియం స్టిక్కర్ల వరకు ప్రతి అంశంలో కమిషన్లే నడుస్తున్నాయని ఆరోపించారు. గతంలో తక్కువ ఖర్చుతో పూర్తయ్యే రేడియం స్టిక్కర్లకు ఇప్పుడు రూ.6 వేల నుంచి రూ.7 వేల వరకు వసూలు చేస్తున్నారని విమర్శించారు. ప్రజలు ఆరోగ్యంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమని పేర్కొన్న హరీశ్ రావు, లారీ యజమానులు, డ్రైవర్లు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అవసరమైన వారికి తన సొంత ఖర్చుతో కళ్లద్దాలు, కంటి శస్త్రచికిత్సలు చేయిస్తానని, వ్యక్తిగత బీమా సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు. సిద్దిపేట లారీ అసోసియేషన్‌కు ప్రత్యేక పార్కింగ్ స్థలం కేటాయించేలా తన వంతు ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. రాబోయేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## బీఆర్ఎస్ ఖాతాలోని రూ.1,400 కోట్లపై విచారణ జరపాలి

మొదటిపేజీ తరువాయి

కుటుంబాలకు పంపిణీ చేయాలి" అని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత డిమాండ్ చేశారు. తన కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు మళ్లీ బీఆర్ఎస్ పార్టీలో చేరే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. సింగరేణి సంస్థ పరిరక్షణ, కార్మికుల హక్కుల సాధన కోసం చేపట్టిన 'సింగరేణి బాయి బాట' కార్యక్రమంలో భాగంగా క్షేత్రస్థాయిలో కార్మికులతో సమావేశమైన ఆమె, అనంతరం మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ విధానాలు, చెల్లించాల్సిన బకాయిల కారణంగా సింగరేణి సంస్థ తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం కార్మికులకు అవసరమైన మైనింగ్ పరికరాలు కూడా కొనుగోలు చేయలేని పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. అధికారులకు ఒక నిబంధన, రాత్రింబవళ్లు శ్రమించే కార్మికులకు మరో నిబంధన అమలు చేస్తున్నట్లు యాజమాన్యం వ్యవహరిస్తోందని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ వైఖరి కారణంగా తెలంగాణ హక్కుగా ఉన్న బొగ్గు బ్లాక్‌లు ప్రైవేట్ సంస్థలకు వెళ్తున్నాయని కవిత విమర్శించారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు సింగరేణిలో 62 వేల మంది రెగ్యులర్ కార్మికులు ఉండగా, ప్రస్తుతం వారి సంఖ్య 38 వేలకు తగ్గిపోయిందని పేర్కొన్నారు. కాంట్రాక్ట్, శాశ్వత ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికుల వారసత్వ ఉద్యోగాల కోసం ప్రతి నెల కనీసం రెండుసార్లు మెడికల్ బోర్డు నిర్వహించాలని కవిత కోరారు. డిపెండెంట్ ఉద్యోగాల అంశంపై ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోతే ఈ నెల 20 నుంచి రామగుండంలో నిరవధిక దీక్ష చేపడతామని హెచ్చరించారు.

## 1,500 కండక్టర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

హైదరాబాద్, జూలై 9, సిరి న్యూస్

"టీజీఎస్ఆర్టీసీలో ఖాళీగా ఉన్న 1,500 కండక్టర్ పోస్టులను త్వరలో భర్తీ చేయనున్నాం. ఈ నియామకాలకు రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఉండదు. టెన్త్ తరగతిలో సాధించిన మార్కుల ఆధారంగా మెరిట్ జాబితా రూపొందించి అభ్యర్థులను ఎంపిక చేస్తాం" అని తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది.

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ)లో చాలా సంవత్సరాల తర్వాత శాశ్వత ప్రాతిపదికన కండక్టర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మొత్తం 1,500 పోస్టులను భర్తీ చేయనున్న ఈ నియామక ప్రక్రియను ఆర్టీసీ యాజమాన్యమే నేరుగా నిర్వహించనుంది. పోటీ పరీక్షలు లేకుండానే ప్రభుత్వ ఉద్యోగం లభించే అవకాశం ఉండటంతో నిరుద్యోగ యువతలో ఆసక్తి నెలకొంది.

ఈ నియామకాల్లో అభ్యర్థుల ఎంపిక పూర్తిగా పదో తరగతిలో సాధించిన మార్కుల ఆధారంగా జరగనుంది. ప్రభుత్వం అమలు చేస్తున్న రిజర్వేషన్లు, రోస్టర్ విధానాన్ని అనుసరించి మెరిట్ జాబితాను రూపొందించి నేరుగా నియామకాలు చేపట్టనున్నారు. దీంతో రాత పరీక్షలు, ఇంటర్వ్యూల అవసరం ఉండదని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన తర్వాత పర్మినెంట్ ప్రాతిపదికన కండక్టర్ పోస్టులను భర్తీ చేయడం ఇదే తొలిసారి. గత కొన్నేళ్లుగా ఉద్యోగులు పదవీ విరమణ చేయడంతో ఆర్టీసీలో భారీ సంఖ్యలో ఖాళీలు ఏర్పడ్డాయి. ముఖ్యంగా హైదరాబాద్, సికింద్రాబాద్ నగరాల్లో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఔట్‌సోర్సింగ్ సిబ్బందితో సేవలు కొనసాగించారు. ఇప్పుడు శాశ్వత నియామకాలు చేపట్టడం ద్వారా సిబ్బంది కొరతను అధిగమించాలని ప్రభుత్వం భావిస్తోంది. అయితే నియామకాలకు ముందు పదో తరగతి అర్హతల విషయంలో ఉన్న సాంకేతిక అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది. గతంలో మార్కుల విధానం అమల్లో ఉండగా, తర్వాత జీపీఏ విధానాన్ని ప్రవేశపెట్టారు. ఇటీవల మళ్లీ మార్కుల విధానాన్ని అమలు చేస్తున్నారు. దీంతో కొందరి సర్టిఫికెట్లలో మార్కులు, మరికొందరివాటిలో జీపీఏ మాత్రమే ఉండటంతో వాటిని ఒకే ప్రామాణిక విధానంలో ఎలా పరిగణించాలనే అంశంపై ప్రభుత్వం మార్గదర్శకాలు రూపొందిస్తోంది. ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే అధికారిక నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది. అర్హతలు, వయోపరిమితి, రిజర్వేషన్లు, జీపీఏ మార్పిడి విధానం తదితర వివరాలను నోటిఫికేషన్‌లో వెల్లడించనున్నారు.

## ఏడేళ్ల ప్రేమ.. మరొకరితో పెళ్లి

రాజన్న సిరిసిల్ల, జూలై 9, సిరి న్యూస్

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి గ్రామంలో ప్రేమ వ్యవహారం వివాదాస్పదంగా మారింది. ఏడేళ్లుగా ప్రేమలో ఉన్న యువతి తనను కాకుండా మరొకరిని వివాహం చేసుకోబోతుందని ఆరోపిస్తూ ఓ యువకుడు గ్రామమంతా పోస్టర్లు అతికించడం కలకలం రేపింది. యువతి, కాబోయే వరుడి ఫొటోలతో కూడిన ఈ పోస్టర్లు గ్రామంలోని కూడళ్లు, ప్రధాన రహదారులు, గోడలపై ప్రత్యక్షమవడంతో స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పోస్టర్లలో యువకుడు.. గత ఏడేళ్లుగా తాము ప్రేమించుకుంటున్నామని, ఈ విషయం యువతి కుటుంబ సభ్యులకు తెలిసినా బలవంతంగా వేరొకరితో వివాహం నిశ్చయించారని ఆరోపించాడు. తమ ప్రేమ వ్యవహారం గురించి కాబోయే వరుడికి కూడా వివరించినప్పటికీ, అతడు 16 తులాల బంగారం తీసుకుని పెళ్లికి అంగీకరించాడని పోస్టర్లలో పేర్కొన్నాడు. ఈ పెళ్లిని నిలిపివేయాలని గ్రామ ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ పోస్టర్లు అంటించాడు. ఈ ఘటనతో గ్రామంలో ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. విషయం తెలుసుకున్న యువతి కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. తమ కుటుంబ పరువుకు భంగం కలిగేలా తప్పుడు ప్రచారం చేశారని, పోస్టర్లు అంటించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోస్టర్లను ఎవరు ముద్రించారు, వాటిని ఎవరు గ్రామంలో అతికించారు, అందులో చేసిన ఆరోపణల్లో ఎంతవరకు వాస్తవం ఉందనే అంశాలపై విచారణ కొనసాగిస్తున్నారు.

# బాధిత కుటుంబాలకు భరోసా

- రూ.5 వేల ఆర్థిక సాయం
- కష్టకాలంలో పార్టీ అండగా ఉంటుందని హామీ
- రెండు కుటుంబాలను పరామర్శించిన టిఆర్ఎస్ జిల్లా నాయకులు కంటారెడ్డి తిరుపతిరెడ్డి



**మెదక్ జులై 9 సిరి న్యూస్**

పాపన్నపేట మండలంలో విషాదంలో ఉన్న రెండు కుటుంబాలను బీఆర్ఎస్ జిల్లా నాయకులు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి గురువారం వరుసగా పరామర్శించారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుర్తివాడ గ్రామానికి చెందిన జయమ్మ కుటుంబ సభ్యులను ఓదార్చడంతో పాటు, అనారోగ్యంతో కన్నుమూసిన సిద్ధంశెట్టి సంగయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. బాధలో ఉన్న కుటుంబాలకు అండగా నిలుస్తూ, కష్టకాలంలో పార్టీ ఎల్లప్పుడూ ప్రజల వెంటే ఉంటుందని భరోసా కల్పించారు.మొదట కుర్తివాడ గ్రామానికి చేరుకున్న కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జయమ్మ కుటుంబ సభ్యులను కలిసి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులను ఓదారుస్తూ, ప్రమాదంలో జయమ్మ అకాల మరణం ఎంతో బాధాకరమని పేర్కొన్నారు. ఒక కుటుంబంలో ఇలాంటి విషాదం చోటు చేసుకోవడం తీరని లోటని అన్నారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, జీవితాన్ని ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి తన వ్యక్తిగత వంతు సహాయంగా రూ.5,000 నగదు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సహాయం పెద్దది కాకపోయినా, కష్టసమయంలో తమ అండను తెలియజేసే చిన్న ప్రయత్నమని పేర్కొన్నారు. బాధిత కుటుంబం ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకుని, అవసరమైతే భవిష్యత్తులో కూడా అన్ని విధాలుగా సహకరిస్తామని హామీ ఇచ్చారు.జయమ్మ మృతి పట్ల గ్రామస్తులు కూడా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారని, ఇలాంటి ప్రమాదాలు మరెవరికీ జరగకుండా ప్రతి ఒక్కరూ రహదారి భద్రతా నిబంధనలు పాటించాలని ఆయన సూచించారు. కుటుంబాన్ని కోల్పోయిన వారి బాధను ఎవరూ తీర్చలేరని, అయితే సమాజం, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు అండగా నిలవడం ద్వారా వారికి కొంత ధైర్యం లభిస్తుందని అన్నారు.అనంతరం మండలం లోని పాత లింగాయిపల్లి గ్రామానికి వెళ్లిన కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, చీకోడ్ పీఏసీఎస్ చైర్మన్, బీఆర్ఎస్ నాయకులు సిద్ధంశెట్టి దత్తును పరామర్శించారు. ఇటీవల ఆయన తండ్రి సిద్ధంశెట్టి సంగయ్య అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకుని స్వయంగా వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా సంగయ్య చిత్రపటానికి నివాళులర్పించిన ఆయన, కుటుంబ సభ్యులతో కొంతసేపు మాట్లాడి వారి మనోభావాలను తెలుసుకున్నారు. ఇలాంటి సమయంలో ధైర్యం కోల్పోవద్దని, కుటుంబ సభ్యులంతా ఒకరికి ఒకరు అండగా నిలవాలని సూచించారు. సంగయ్య గ్రామంలో మంచి పేరు సంపాదించుకున్న వ్యక్తి అని, ఆయన మరణం కుటుంబంతో పాటు గ్రామానికీ తీరని లోటని పేర్కొన్నారు.మరణం ప్రతి ఒక్కరి జీవితంలో తప్పనిసరి అయినప్పటికీ, మంచి మనసుతో జీవించిన వ్యక్తులు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని కంఠారెడ్డి అన్నారు. సంగయ్య ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ, కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు.రెండు గ్రామాల్లోనూ స్థానిక ప్రజలు కంఠారెడ్డి తిరుపతిరెడ్డికి తమ సమస్యలను వివరించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం నుంచి అందాల్సిన సహాయంపై కూడా చర్చించారు. అర్హులైన వారికి ప్రభుత్వ పరంగా లభించే సంక్షేమ పథకాలు, ప్రమాద పరిహారం, ఇతర సహాయాలు అందేలా అవసరమైన స్థాయిలో కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.కష్టకాలంలో ప్రజలను పరామర్శించడం రాజకీయాలకంటే మానవత్వానికి ప్రతీక అని, ప్రజల సుఖదుఃఖాల్లో భాగస్వామ్యం కావడం ప్రతి నాయకుడి బాధ్యత అని ఆయన అన్నారు. ప్రజలకు అవసరమైన సమయంలో అండగా నిలబడడమే నిజమైన ప్రజాసేవ అని పేర్కొన్నారు.ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, స్థానిక నాయకులు మాట్లాడుతూ, విషాదంలో ఉన్న కుటుంబాలను స్వయంగా పరామర్శించి ధైర్యం చెప్పడం అభినందనీయమని పేర్కొన్నారు. ఆర్థిక సహాయం అందించడం ద్వారా బాధిత కుటుంబానికి కొంత ఊరట లభించిందన్నారు. ఇలాంటి సందర్భాల్లో రాజకీయ భేదాలు పక్కనపెట్టి మానవత్వంతో ముందుకు రావడం సమాజానికి మంచి సందేశమని అభిప్రాయపడ్డారు. పరామర్శ కార్యక్రమంలో ఏడుపాయల దేవస్థానం మాజీ చైర్మన్ బాలగౌడ్, మాజీ గ్రామ అధ్యక్షుడు సిద్ధిరామిరెడ్డి, మాజీ ఏడుపాయల దేవస్థానం డైరెక్టర్ మోహన్‌రావు, బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పడాల సతీష్, కల్వకుంట సర్పంచ్ అందె కొండల్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్, విల్సన్, చంద్రమోహన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# జననేతకు జననీరాజనం



**ఝరాసంఘం, జులై 9(సిరిన్యూస్)**

జహీరాబాద్ శాసనసభ్యులు శ్రీ కొణింటి మాణిక్ రావు గారి జన్మదిన వేడుకలను ఝరాసంఘం మండలంలో గల ప్రసిద్ధ పుణ్య క్షేత్రం శ్రీ కేతకి సంగమేశ్వర ఆలయంలో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గారి ఆయురారోగ్యాలు, ప్రజాసేవ మరింత విస్తరించాలని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి దేవుని ఆశీస్సులు కోరారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన ప్రతినిధులు, అభిమానులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాణిక్ రావు గారు ప్రజలకు మరింత చేరువై అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని, ఆయురారోగ్యాలతో ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని అందరూ ఆకాంక్షించారు.ఈ సందర్భంగా పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ, ఎమ్మెల్యే కొణింటి మాణిక్ రావు గారు నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారని, ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటున్నారని కొనియాడారు.చివరిగా అన్నదాన కార్యక్రమం నిర్వహించి భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. జన్మదిన వేడుకలు ఆధ్యాత్మిక వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో, అత్యంత వైభవంగా ముగిశాయి.

# బి ఎల్ వో ఆఫీస్ లో కాంగ్రెస్ శ్రేణుల సందర్శన



**జిన్నారం జులై 09 సిరి న్యూస్**

బొల్లారం డివిజన్ పరిధిలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఇంటింటి సర్వే జోరుగా కొనసాగుతోంది. (సర్) ప్రక్రియను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు వి.చంద్రారెడ్డి మరియు పట్టణ పార్టీ అధ్యక్షుడు జైపాల్ రెడ్డి బి.ఎల్.ఓ కార్యాలయాలను గురువారం సందర్శించారు. ఎన్యుమరేషన్ ఫారాలలో ఓటర్లకు అవసరమైన సహాయ సహకారాలను అందించాలని, ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని సూచనలు, సలహాలను అందించారు. ప్రక్రియ నిర్వహణలో తమ సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. వివరాల నమోదులో ఓటర్లకు తలెత్తే సందేహాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు సంపత్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, రాష్ట్ర కార్మిక నాయకులు వి.వరప్రసాద్ రెడ్డి , శంకర్(పాస్టర్), మాజీ కౌన్సిలర్ నర్సింహారాజు, మాజీ ఎం.పీ.టీ.సీ కృష్ణంరాజు, మాజీ వార్డ్ మెంబెర్ భాస్కర్, యువజన నాయకులు అబ్దుల్ బషీర్ , ఇమ్రాన్, చక్రపాణి, కుమార్, దిగంబర్ , నవీన్, ఓటర్ మహిళలు, యువకులు ఉన్నారు.

# సీఎం ఆర్ ఎఫ్ చెక్కుల పంపిణీ

**తూప్రాన్ జులై 9 సిరి న్యూస్**




తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని 11వ వార్డు పడాల పల్లి 12వ వార్డు హైదర్ గూడ కు స ం బ ం ధించిన పలువురికి గురువారం సీఎం ఆర్ ఎఫ్ చెక్కులను అందచేసిన మున్సిపల్ చైర్మన్ బొంది రజిని రవీందర్ గౌడ్ ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ రవీందర్ గౌడ్ కౌన్సిలర్ జైపాల్ రాథోడ్ వంశీ యాదవ్ పాల్గొన్నారు

# సర్ ప్రక్రియ' పై తహసిల్దార్ స్పెషల్ ఫోకస్

## హెల్ప్ డెక్స్ లను పరిశీలన



**అమీన్పూర్ జులై 09 సిరి న్యూస్**

అమీన్పూర్ మండల పరిధిలోని పటేల్ గూడా పీఎస్ నెంబర్ 140,147 ఐలాపూర్ తండా పరిధి పిఎస్ నెంబర్ 138 139 సాయి కాలనీ పిఎస్ నెంబర్ 198 203 219 220 నెంబర్ల లోని సర్ ప్రక్రియను వేగవంతం చేయడానికి ప్రత్యేక హెల్ప్ డెక్స్ లను గురువారం తహసిల్దార్ స్వయంగా సందర్శించి వాటి పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ సకాలంలో ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా పిఎస్ నెంబర్ల సర్వకిని పూర్తిచేసి రికార్డులను పక్కాగా అప్డేట్ చేయడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో బి ఎల్ వో లు ఓటర్లు తదితరులు పాల్గొన్నారు.

# జోగిపేట సబ్ రిజిస్ట్రార్ భవన నిర్మాణానికి రూ.2కోట్లు

- మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లు కృష్ణారెడ్డి, చిట్టిబాబు
- మంత్రి దామోదర్‌కు కృతజ్ఞతలు

**జోగిపేట, జూలై 09, (సిరి న్యూస్):**

జోగిపేట సబ్ రిజిస్టర్ భవన నిర్మాణానికి రూ.2 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందని, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సి.దామోదర రాజనర్సింహ చొరవతోనే ఈ నిధులు మంజూరైనట్లు అందోల్ జోగిపేట మున్సిపల్ చైర్మన్ ఎస్. కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ ఆకుల చిట్టిబాబు ముదిరాజ్‌లు తెలిపారు. గురువారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడారు. జోగిపేటలో చాలా సంవత్సరాలుగా అద్దె భవనంలో కార్యకలాపాలు కొనసాగిస్తున్నారని వారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిధుల మంజూరుతో కార్యాలయ సిబ్బందికి ఇబ్బందులు దూరమవుతాయని వారన్నారు. నూతన భవనం అన్ని వసతులతో నిర్మాణం జరుగుతుందని, అందోలు నియోజకవర్గ కేంద్రంలో అభివృద్దిలో మరో మైలురాయిగా సబ్ రిజిష్ట్రార్ కార్యాలయ భవనం నిర్మాణం నిలుస్తుందన్నారు. ప్రజలకు ఆధునిక వసతులతో కూడిన రిజిస్ట్రేషన్ సేవలు అందించేందుకు ప్రభుత్వం మరో కీలక అడుగు వేసిందన్నారు. ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన, నాణ్యమైన రిజిస్ట్రేషన్ సేవలందించాలనే రాష్ట్ర ప్రభుత్వ సంకల్పానికి ఇది నిదర్శనం అన్నారు. జోగిపేటలో పలు ప్రభుత్వ కార్యాలయాలకు వేలాది కోట్లు మంజూరు కావడం మన అదృష్టమన్నారు. మున్సిపల్ తో పాటు నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అభివృద్ధి కార్యక్రమాలు చురుకుగా కొనసాగుతున్నాయన్నారు. సబ్ రిజిష్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరు చేయించినందుకు మంత్రి దామోదర్‌కు కృష్ణారెడ్డి, చిట్టిబాబులు కృతజ్ఞతలు తెలిపారు.



# ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలి

- గ్రామ పంచాయతీల ఆదాయ వనరులను పెంచుకోవాలి.
- గ్రామ పంచాయతీ - సమగ్ర ప్రణాళికతో మూడేళ్ల అభివృద్ధికి కార్యాచరణ రూపొందించాలి.
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.

**మెదక్ జూలై 09(సిరి న్యూస్)**



గ్రామ పంచాయతీలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు.గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం,జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మీటింగ్ హాల్లో మెదక్ నియోజకవర్గానికి చెందిన సర్పంచులు,పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న నిధులను సద్వినియోగం చేసుకుని చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటివరకు జిల్లాలో వివిధ అభివృద్ధి పనులకు మంజూరైన నిధులతో చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు.ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న సహజ వనరులు, స్థానిక ఆదాయ మార్గాలను గుర్తించి పంచాయతీ ఆదాయాన్ని పెంచుకునే విధంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని అన్నారు. గ్రామ పంచాయతీలు ఆర్థికంగా బలోపేతం అయితేనే మరింత అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

**పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యత**

గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను యుద్ధ ప్రాతిపదికన నిర్వహించాలని ఆదేశించారు. గ్రామ సభల్లో ప్రజల నుంచి వచ్చిన ప్రధాన సమస్యలను ప్రతి గ్రామ పంచాయతీ గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి విద్యారావ్ జడ్పీ సీఈఓ ఎల్లయ్య,డీపీఓ యాదయ్య,మిషన్ భగీరథ ఈ.ఈ సంపత్ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి వార్షికోత్సవంలో యాదగిరి యాదవ్

**పటాన్‌చెరు, జూలై 9 (సిరి న్యూస్):**

పటాన్‌చెరు నియోజకవర్గంలోని జేపీ కాలనీ డివిజన్ బండలగూడ మార్క్స్ నగర్ కాలనీలోని శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి దేవాలయం 19వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా రామచంద్రపురం మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రామ్ రెడ్డి, దత్తు, నారాయణ, శ్రీశైలం కాలనీ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేశారు..



# గీతంలో బీబీఏ కోర్సు..

- 2026–27 విద్యా సంవత్సరం ప్రవేశాలు..
- బోవర్ స్కూల్ ఆఫ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సహకారం

**పటాన్చెరు, జూలై 9 (సిరి న్యూస్):**

GITAM
DEEMED TO BE UNIVERSITY

హైదరాబాద్‌లోని గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్, బోవర్ స్కూల్ ఆఫ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సహకారంతో 2026–27 విద్యా సంవత్సరం నుంచి బీబీఏ (ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్) కోర్సును ప్రారంభిస్తున్నట్లు గురువారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది.నాలుగేళ్ల ఈ అండర్‌గ్రాడ్యుయేట్ కోర్సులో వ్యాపార నిర్వహణతో పాటు పారిశ్రామిక నైపుణ్యాలపై ఆచరణాత్మక శిక్షణ అందించనున్నట్లు పేర్కొంది. స్టార్టప్‌లు, పరిశ్రమ నిపుణుల మార్గదర్శకత్వం, ఇంటర్న్‌షిప్‌లు, ఇన్నోవేషన్ కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు ప్రత్యక్ష అనుభవం కల్పించనున్నట్లు వెల్లడించింది.ఇంటర్మీడియట్ లేదా 10+2లో కనీసం 50 శాతం మార్కులతో పాటు గీతం ప్రవేశ పరీక్ష (గాట్–2026)లో అర్హత సాధించిన విద్యార్థులు ఈ కోర్సులో ప్రవేశానికి అర్హులని, ప్రతిభ ఆధారంగా స్కాలర్‌షిప్‌లు కూడా అందజేయనున్నట్లు గీతం పేర్కొంది.

# పారిశుద్ధ్యం... పంచాయతీ కేంద్రాల్లో అధ్వానం..

- వర్షా కాలం వచ్చిన మురుగు కాల్వలలో తొలగని మురుగు...
- దోమలకు ఆవాసంగా మారుతున్న మురుగు కాలువలు..

**వెల్దుర్తి జూలై 09,(సిరి న్యూస్) :**

వెల్దుర్తి మండలంలోని గ్రామపంచాయతీలలో చెత్తను సేకరించేందుకు సరైన వనరులు లేక పోవడంతో ఎక్కడపడితే అక్కడ చెత్త పేరుకుపోతుంది. ముఖ్యంగా మురికి కాలువలు శుభ్రతకు నోచుకోవడం లేదు. మురుగు కాలువల్లో ప్లాస్టిక్ కవర్ల తోపాటు ఇతర చెత్తను కాలువల్లో పడేయడంతో దోమలకు ఆవాసంగా మారుతున్నాయి. ప్రతి గ్రామ పంచాయతీకి చెత్తను తరలించేందుకు ట్రాక్టర్ తో పాటు కార్మికులను నియమించిన వారు కేవలము రోడ్ల శుభ్రతకే సరిపోతున్నారు. వర్షాకాలంలో మురికి కాలవల ల్లో చెత్త ను తొలగించకపోవడంతో దోమలు విపరీతంగా పెరిగి ప్రజలపై దాడి చేస్తున్నాయి. దీంతో ప్రజలు వైరల్ జరాల బారిన పడే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఇప్పటికైనా పంచాయతీరాజ్ శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకుని మురికి కాలువలను శుభ్రం చేయించాలని ప్రజలు కోరుతున్నారు..



### మార్గదర్శకాలకు తిలోదకాలు...

తెలంగాణ పంచాయతీ రాజ్ శాఖ వ్యవస్థలో చెత్త నిర్వహణకు సంబంధించి స్పష్టమైన మార్గదర్శకాలు ఉన్నప్పటికీ అధికార యంత్రాంగం అమలు పరచడం లేదు. ప్రతి ఇంటి నుంచి నిర్దిష్ట రోజుల్లో చెత్తను సేకరించాలి. తడి పొడి చెత్తను ఇంటి వద్దనే విభజించి సేకరించాలి. జనాభా ఆధారంగా అవసరమైన సిబ్బందిని ఏర్పాటు చేసుకోవడం, గ్రామాల్లో చెత్త పేరుకుపోకుండా పర్యవేక్షణ చేయాలి. తడి ఇతర వ్యర్థాలను కంపోస్ట్ ఎరువుగా మార్చేందుకు గత ప్రభుత్వం కోట్ల రూపాయలను వెచ్చించి నిర్మించిన కంపోస్ట్ షెడ్లు నిర్వహణ లేక వృధాగా మారాయి.

### అద్వాన్నంగా మురికి కాలువలు..

గ్రామపంచాయతీలో మురుగునీరు.. వర్షం నీరు రోడ్లపై రాకుండా నిర్మించిన మురుగు కాలువలు అధ్వానంగా మారాయి. ఈ కాలులను శుభ్రం చేయకపోవడంతో కాలువలు నిండిపోయి వర్షం నీటితోపాటు మురుగునీరు రోడ్లపై చేరి దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి. వర్షాకాలం కు ముందు మురుగు కాలువలను శుభ్రం చేయించవలసిన పంచాయితీ అధికారులు నిధులు రావడం లేదని సాకుతో మురుగు కాలును పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం పంచాయతీలకు విడుదల చేసిన నిధులను పంచాయతీ అధికారులు వాటిని గత ప్రభుత్వ హాయంలో ఖర్చు చేసిన వాటికి నిధులను తీసుకున్నారు. దీంతో వర్షాకాలం ప్రారంభమైన నేటికీ పలు పంచాయతీల్లో మురుగు కాలువలు నిండుకుపోయిన వాటిని పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా యుద్ధ ప్రాతిపదకన మూరకి కాలువలను శుభ్రం చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

### శుభ్రత పనులు చేపడతాం..

ఎంపీఈఓ నవీన్ రెడ్డి గ్రామపంచాయతీలో శుభ్రత పనులను ప్రారంభించి పూర్తి చేస్తామని ఎంపీఈఓ నవీన్ రెడ్డి అన్నారు. వర్షాకాలంలో గ్రామాల్లో శుభ్రత పాటించాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశామని అన్నారు.



# 40 ఫీట్ల రోడ్డు 28 అడుగులకు కుదింపు!

- పెద్దమ్మ గూడెం గ్రామస్తుల అగ్రహం
- ఎమ్మార్వో'కమిషనర్ కు ఫిర్యాదు

**జిన్నారం జులై 09 సిరి న్యూస్**

పెద్దమ్మ గూడెం గ్రామంలోని మాస్టర్ ప్లాన్ లేదా రికార్డుల ప్రకారం 40 ఫీట్ల వెడల్పు ఉండాల్సిన ప్రధాన రోడ్డును కొందరు ప్రయోజనాల కోసం కేవలం 28 అడుగులకే పరిమితం చేస్తూ పనులు కొనసాగించడం పై గ్రామస్తులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పెద్దమ్మ గూడెం నివాసి చిత్తారి యాదవ్ మాట్లాడుతూగురువారం అధికారులకు ఈ అన్యాయంపై పెద్దమ్మ గూడెం గ్రామ ప్రజలం ఏకమై స్థానిక ఎమ్మార్వో మరియు మున్సిపల్ కమిషనర్ కు స్వయంగా కలిసి ఫిర్యాదుల వినతి పత్రాన్ని సమర్పించామణి తెలిపారు.భవిష్యత్తుపై ఆందోళన గ్రామం వేగంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో రోడ్డు వెడల్పును 40 అడుగుల నుంచి 28 అడుగులకు తగ్గిస్తే భవిష్యత్తులో తీవ్రమైన ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతాయని, వాహనాల రాకపోకలకు నరకంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పనులను వెంటనే నిలిపివేసి ఎమ్మార్వో మరియు కమిషనర్ స్వయంగా క్షేత్రస్థాయికి వచ్చి రోడ్డు కొలతలను పరిశీలించాలని రికార్డుల ప్రకారం నిర్మించేలా చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఒకవేళ అధికారుల నుంచి



స్పందన రాకపోతే రోడ్డు వెడల్పును తగ్గించే ప్రయత్నాలను అడ్డుకుంటామని అవసరమైతే పెద్ద ఎత్తున పెద్దమ్మ గూడెం గ్రామం అంత ఏకమై ఆందోళనలు, ధర్నాలకు దిగుతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో గోపి యాదవ్ వెంకటేష్ భరత్ తదితరులు పాల్గొన్నారు.

# వికసిత్ భారత్ బిల్డథాన్ పోటీలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల ప్రతిభ.

**వెల్దుర్తి జులై 09,( సిరి న్యూస్ ):**

వెల్దుర్తి మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వెల్దుర్తి విద్యార్థులు వికసిత్ భారత్ బిల్డథాన్ (VBB) పోటీలలో ప్రతిభ కనబరిచారు.పాఠశాలకు చెందిన మహమ్మద్ నాసర్ మోహిద్దీన్ , లిఖిత బృందం రెండు విభాగాల్లో ఎంపిక కావడం విశేషం. అని సాంబయ్య తెలిపారు. వీరు వాహనాలు వెళ్లేటప్పుడు రోడ్లపై విద్యుత్తును ఉత్పత్తి చేసే పీజోఎలక్ట్రిక్ ప్లేట్లు, శిలాజ ఇంధనాలకు బదులుగా హరిత శక్తి వినియోగం. ఈవెంట్లలో తమ వినూత్న ఆలోచనలు, ప్రాజెక్టులతో ఎంపికై పాఠశాలకు



గౌరవం తీసుకొచ్చారు. అని విద్యార్థులను కొనియాడారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. సాంబయ్య, ఉపాధ్యాయులు వెంకటస్వామి, శ్రీనివాస్ రావు, నర్సింహా రెడ్డి, అర్చన,, నవనీత, జయసుధ, విజయ్, చార్లెస్, ఇతర ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించి, వారి విజయానికి కృషి చేసిన మార్గదర్శక ఉపాధ్యాయులను ప్రశంసించారు. భవిష్యత్తులో కూడా విద్యార్థులు జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులు, గ్రామస్థులు ఎంపికైన విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విజయం సాధించిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వము ఒక్కొక్క గ్రూపుకు పదివేల రూపాయలు చొప్పున బహుమతులు ఇవ్వబడును అని హెచ్ ఓ డి సాంబయ్య తెలిపారు.

# అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు.. ఎంపీపీఎస్‌కు కొత్త భవనం కోరుతూ వినతి..

- హౌసింగ్ ప్రాజెక్ట్ ఆఫీసర్, కలెక్టర్‌ను కలిసిన మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్

**రామచంద్రపురం, జూలై 9 (సిరి న్యూస్):**

రామచంద్రపురం డివిజన్‌లోని భారతి నగర్ పరిధిలో అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు మంజూరు చేయాలని, అలాగే శ్రీనివాస్ నగర్ కాలనీలో శిథిలావస్థకు చేరిన ఎంపీపీఎస్ పాఠశాలకు నూతన భవనం నిర్మించేందుకు నిధులు కేటాయించాలని కోరుతూ రామచంద్రపురం మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ గురువారం సంగారెడ్డిలో హౌసింగ్ ప్రాజెక్ట్ ఆఫీసర్ చలపతిరావు, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌కు వేర్వేరుగా వినతి పత్రాలు అందజేశారు.భారతి నగర్ డివిజన్‌లో సొంత స్థలం ఉన్న అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద రూ.5 లక్షల ఆర్థిక సాయం మంజూరు చేయాలని, అద్దె ఇళ్లలో నివసిస్తూ రోజువారీ కూలి పనులతో జీవనం సాగిస్తున్న పేద కుటుంబాలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ అంశంపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి స్పందించి హౌసింగ్ అధికారులతో మాట్లాడటంతో పాటు అవసరమైన ఎండార్స్‌మెంట్ లేఖను పంపించినట్లు తెలిపారు.అనంతరం శ్రీనివాస్ నగర్ కాలనీలోని ఎంపీపీఎస్ పాఠశాల భవనం శిథిలావస్థలో ఉండటంతో విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పాఠశాలకు తక్షణమే నూతన భవనం నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం



సమర్పించారు. ఈ అంశంపై మంత్రి ఇప్పటికే కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి సమస్యను పరిశీలించి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించినట్లు పుష్పనగేష్ తెలిపారు.

# జిల్లా సంయుక్త కార్యదర్శిగా కే. శ్రీనివాస్ రెడ్డి

**అమిన్ పూర్ జూలై 09 సిరి న్యూస్**

టీయూడబ్ల్యూజే (ఐజేయూ) సంగారెడ్డి జిల్లా సంయుక్త కార్యదర్శిగా శ్రీనివాస్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం సంగారెడ్డిలో నిర్వహించిన టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా మహాసభలో రామచంద్రపురం మండలానికి చెందిన కే. శ్రీనివాస్ రెడ్డిని జిల్లా సంయుక్త కార్యదర్శిగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి తనను ఈ పదవికి ఎన్నుకోవడంలో విశ్వాసం ఉంచిన రాష్ట్ర అధ్యక్షులు వీరహత్ అలీ, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.ఏ.కే. పైసల్, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనాథ్‌తో పాటు సంగారెడ్డి జిల్లా జర్నలిస్టు మిత్రులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము



చేయకుండా జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం అంకిత భావంతో పనిచేస్తానని హామీ ఇచ్చారు. జిల్లా జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు..

# యువతిని తీసుకువెళ్లిన వారిపై కేసు నమోదు

**పాపన్నపేట జూలై 9 సిరి న్యూస్ :**

ప్రేమించి వివాహం చేసుకున్న యువతిని అత్తగారింటి నుంచి బలవంతంగా తీసుకు వెళ్లిన యువతి తరపు వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సె శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు.ఆయన తెలిపిన వివరాల ప్రకారం...పాపన్నపేట మండలం ఎల్లాపూర్ గ్రామానికి చెందిన యువకుడు, కొడిపల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతిని ప్రేమ వివాహం చేసుకొని ఈనెల 6న పాపన్నపేట పోలీసు స్టేషన్ కు వచ్చారు.ఇద్దరు మేజర్ లు కావడంతో పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చారు.అనంతరం యువకుడు యువతిని తీసుకొని ఎల్లాపూర్ లోని ఇంటికి వెళ్లాడు.బుధవారం యువతి తరపు వారు ఎల్లాపూర్ లోని యువకుడి ఇంటికి వచ్చి ఇంట్లో ఉన్న యువతిని బయటకు తీసుకు వచ్చారు.అడ్డు వచ్చిన యువకుడి కుటుంబీకులను తప్పించి యువతిని బలవంతంగా కారులో ఎక్కించుకొని తీసుకువెళ్లడంతో యువకుడు ఈ మేరకు యువకుడు ఠాణాలో ఫిర్యాదు చేయగా యువతి తరపు వారు ఐదుగురిపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సె పేర్కొన్నారు.ఇదిలా ఉండగా గురువారం మెదక్ సీఐ కార్యాలయంలో యువతి, యువకుడికి కౌన్సిలింగ్ ఇచ్చారు.యువతి ఇష్టం మేరకు ఆమెను యువకుడికి అప్పగించారు.

# ఇందిరమ్మ కాలనీలో ఆధ్యాత్మిక వైభవం

## భక్తిశ్రద్ధల తో దుర్గమ్మ గుడికి భూమి పూజ
## ఎమ్మెల్యే చేతుల మీదుగా తొలి అడుగు



**అమీన్పూర్ జులై 09 సిరి న్యూస్**

అమీన్పూర్ సర్కిల్ బీరంగూడ డివిజన్ పరిధిలోని పటేల్ గూడ ఇందిరమ్మ కాలనీలో శ్రీ దుర్గమ్మ తల్లి దేవాలయం భూమి పూజ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి. దేవాలయ నిర్మాణానికి,సంపూర్ణ సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేవానంద్ ముదిరాజ్,మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నందారం నరసింహా గౌడ్, సీనియర్ నాయకులు మల్లేష్, జ్ఞానేశ్వర్, గోపాల్, శ్రీకాంత్, ఆలయ కమిటీ సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# తిమ్మరెడ్డిపల్లిలో దొంగతనం – కేసు నమోదు



**గజ్వేల్ జులై 09 (సిరి న్యూస్ )**

కొండపాక మండలం తిమ్మ రెడ్డిపల్లి గ్రామంలో దొంగతనం జరిగిన ఘటన వెలుగులోకి వచ్చింది. వివరాల ప్రకారం, గ్రామానికి చెందిన గర్నేపల్లి చంద్రం అనే వ్యక్తి తన ఇంటికి తాళం వేసి పని నిమిత్తం ఇతర ఊరికి వెళ్లాడు. ఈరోజు ఉదయం సుమారు 9 గంటల సమయంలో తిరిగి వచ్చి చూసే సరికి ఇంటి బయట ఉన్న తాళం పగలగొట్టబడినట్లు గమనించాడు.అతను ఇంటి లోపలికి వెళ్లి పరిశీలించగా, బీరువాలో ఉంచిన రెండు బంగారు ఉంగరాలు, అలాగే అతని భార్య మరియు కూతురికి చెందిన వెండి పట్టీలు కనిపించకుండా పోయినట్లు గుర్తించాడు.ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. క్లూస్ టీమ్ సంఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలను సేకరించింది

# మోత్కుపల్లి నరసింహులు పై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు



**వెల్దుర్తి,,జులై 09,(సిరి న్యూస్):**

ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మంత్రి వెంకట్ స్వామి వివేక్, లపై మోత్కుపల్లి నరసింహులు చేసిన అనుచిత వాక్యాలతో మండిపడ్డ జి ఎం ఎం నాయకులు. మోత్కుపల్లి నరసింహులు పై చట్టరీత్య చర్యలు తీసుకోవాలని వెల్దుర్తి పోలీస్ స్టేషన్లో గురువారం జి ఎం ఎం అధ్యక్షులు సంజీవ, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రులపై చేసిన వ్యాఖ్యలను వెనుకకు తీసుకోవాలని లేనియెడల మోత్కుపల్లి ఇంటి ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు సంజీవ, ప్రధాన కార్యదర్శి నీరుడి ప్రభాకర్, తాళ్ల ఆనందరావు, దాడిగా నరేష్, తదితరులు పాల్గొన్నారు.

# టీయూడబ్ల్యూజే (ఐజేయూ) సంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడిగా శ్రీనాథ్..

## వరుసగా రెండోసారి ఏకగ్రీవ ఎన్నిక

**రామచంద్రపురం, జూలై 9 (సిరి న్యూస్):**



టీయూడబ్ల్యూజే (ఐజేయూ) సంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడిగా శ్రీనాథ్ వరుసగా రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా తనపై మరోసారి విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షులు వీరహత్ అలీ, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.ఏ.కే. పైసల్‌తో పాటు తన ఎన్నికకు సహకరించిన సంగారెడ్డి జిల్లా జర్నలిస్టు మిత్రులందరికీ ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం మరింత బాధ్యతతో, అంకితభావంతో పనిచేస్తానని శ్రీనాథ్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఈ సందర్భంగా పేర్కొన్నారు

# మున్సిపల్ సాధారణ సమావేశం

## కరెంట్ సమస్యలు ఉండకూడదు

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి




**నర్సాపూర్ జూలై 9( సిరి న్యూస్ )**

నర్సాపూర్ పురపాలక సంఘం కౌన్సిల్ సాధారణ సమావేశము, గురువారం చైర్ పర్సన్ మాచు నూరి లక్ష్మి రాజు యాదవ్ అధ్యక్షతన, మున్సిపల్ కమిషనర్ చెరుకు సాయికుమార్ ఆధ్వర్యంలో జరిగింది ఈ సమావేశంలో నర్సాపూర్ అభివృద్ధి పనులపై చర్చించి పలు అంశాల పై తీర్మానాలు చేశారు అండర్ డ్రైనేజ్ సీసీ రోడ్లు సరిత గతిన పూర్తి చేయాలని ప్రస్తుత వర్షాకాలం ఉన్నందున సీజనల్ వ్యాధులు రాకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కరెంటు సమస్యలు తలెత్తకుండా చూడాలని ట్రాన్స్ ఫార్మర్ వీధి దీపాలకు ప్రత్యేక కరెంటు వైర్ ఏర్పాటు చేయుటకు సంబంధించిన వాటికి తీర్మానం చేశారు ఈ కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ బుచ్చేష్ యాదవ్ కౌన్సిలర్లు శ్ర ఎం నరసమ్మ అంతారం సుధీర్ గౌడ్ ,అఫ్రీన్ ,జరీనా బేగం,మహమ్మద్ మొహిజ్ ఉద్దీన్,చింతకుంట శ్రీకాంత్, వంటేరు సునీత కండెల రాజు , మన్నె నిరంజన్ దాస్ సమీనా బేగం సరళ లలిత అసిస్టెంట్ ఇంజనీర్ కిష్టయ్య , వార్డు అధికారులు, సిబ్బంది, విద్యుత్ శాఖ, ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు

# ప్రీ ప్రైమరీ టీచర్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం.

## చివరి తేదీ జూలై 15 మాత్రమే.

## లక్ష్య డిస్టెన్స్ అకాడమీ కో ఆర్డినేటర్ అనంతుల సతీష్.

**కోదాడ, జూలై 09 ( సిరి న్యూస్):**



కోదాడలోని లక్ష్య ఎడ్యుకేషన్ అకాడమీ ద్వారా ప్రభుత్వ వృత్తి విద్య కోర్సులకు దరఖాస్తులనుఆహ్వాని స్తున్నట్లు కోఆర్డినేటర్ అనంతుల సతీష్ తెలిపారు. ప్రీ ప్రైమరీ టీచర్ ట్రైనింగ్, యోగా, ల్యాండ్ సర్వేయర్, హెల్త్ కేర్ మల్టీపర్పస్ అసిస్టెంట్, ఎలక్ట్రీషన్, బ్యూటిషన్, ఆఫీస్ ఆటోమేషన్ తదితర కోర్సులకు జూలై 15 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు ప్రభుత్వ ఇంటర్మీడియట్ బోర్డు ద్వారా సర్టిఫికెట్లు జారీ చేయబడతాయని తెలిపారు. ఆసక్తి గల వారు ఎస్ఎస్సి మెమో ఆధార్ కార్డు, ఫోటో తీసుకొని రాగలరు నయా నగర్లోని బ్రిలియంట్ స్కూల్ పక్కన ఉన్న లక్ష్య డిస్టెన్స్ అకాడమీని సంప్రదించాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9542107771 నంబర్‌ను సంప్రదించవల సిందిగా లక్ష్య డిస్టెన్స్ అకాడమీ కోఆర్డినేటర్ అనంతుల సతీష్ కోరారు.

# ఇర్కోడు మోడల్ స్కూల్లో పీజీటీ ఇంగ్లీష్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

**సిద్దిపేట జులై 09 (సిరి న్యూస్ )**




మండలంలోని ఇర్కోడు గ్రామంలో ఉన్న తెలంగాణ మోడల్ స్కూల్లో ఖాళీగా ఉన్న పీజీటీ ఇంగ్లీష్ పోస్టు భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వాని స్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఎంఏ ఇంగ్లీష్ తో పాటు సంబంధిత మెథడాలజీలో బీఈడీ పూర్తి చేసి ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 13వ తేదీలోపు తమ దరఖాస్తులను పాఠశాల కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.అదే రోజు జూలై 13న అభ్యర్థులకు ఇంటర్వ్యూతో పాటు డెమో తరగతి నిర్వహించి, ప్రతిభ ఆధారంగా తుది ఎంపిక చేపట్టనున్నట్లుతెలిపారు.ప్రభుత్వ విద్యాసంస్థలో ఉపాధ్యాయ వృత్తిలో చేరాలనుకునే అర్హులైన అభ్యర్థులకు ఇది మంచి అవకాశమని, ఆసక్తి గల వారు గడువులోపు దరఖాస్తు చేసుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

# వెల్దుర్తి మండల కేంద్రంలో ఘనంగా హనుమాన్ వార్షికోత్సవము

**వెల్దుర్తి, జూలై 09, (సిరి న్యూస్):**



వెల్దుర్తి మండల కేంద్రంలో హనుమాన్ 5 వ వార్షికోత్సవ సందర్భంగా గురువారం మాజీ సర్పంచ్ ఆముద భాగ్యమ్మ ఆంజనేయులు వారి ఆధ్వర్యంలో ఘనంగా స్వామివారికి అభిషేకము, ప్రత్యేక పూజ కార్యక్రమం, అలాగే యజ్ఞం నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాదం అందుకొని స్వామి వారి ఆశీర్వాదం తీసుకున్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆదర్శ్,ఉపసర్పంచ్ శ్రవణ్, కుమార్ మాజీ వైస్ ఎంపీపీ సుధాకర్ గౌడ్, నాయకులు కృష్ణ గౌడ్, శాకారం శ్రీనివాస్ గౌడ్,అలాగే పలువురు ప్రముఖులు గ్రామస్తులు పూజా కార్యక్రమంలో పాల్గొని స్వామివారి కరుణాకటాక్షం వలన వెల్దుర్తి మండల ప్రజలు సుఖశాంతులతో అష్టైశ్వర్యాలతో సుఖమైన జీవితం గడపాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటల తో కళకళలాడాలని కోరుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు గ్రామస్తులు భక్తులు పాల్గొన్నారు.

# ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యం.

- కోదాడ రూరల్ ఎస్సైగా షేక్ యాకూబ్ బాధ్యతల స్వీకరణ.

**కోదాడ, జూలై 09 (సిరి న్యూస్):**



కోదాడ రూరల్ పోలీస్ స్టేషన్‌కు నూతన సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ)గా షేక్ యాకూబ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్ఐగా విధులు నిర్వహించిన గోపాల్ రెడ్డి నేరేడుచర్లకు బదిలీ కావడంతో, జిల్లా పోలీసు కార్యాలయంలోని డీసీఆర్‌బీ విభాగంలో పనిచేస్తున్న షేక్ యాకూబ్‌ను కోదాడ రూరల్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు.బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎస్ఐ షేక్ యాకూబ్ మాట్లాడుతూ, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి పోలీసు సేవలను మరింత సమర్థవంతంగా అందిస్తామని తెలిపారు. కోదాడ రూరల్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇస్తామని, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఇవ్వబోమన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో నేరాల నియంత్రణ, ప్రజల్లో భద్రతాభావం పెంపొందించడం, బాధితులకు వేగవంతమైన న్యాయం అందించడం తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలను నిర్భయంగా పోలీసుల దృష్టికి తీసుకురావాలని, ప్రతి ఫిర్యాదును పారదర్శకంగా, నిష్పక్షపాతంగా విచారించి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.అలాగే యువత మాదకద్రవ్యాలు, ఇతర సామాజిక దురాచారాలకు దూరంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో శాంతియుత వాతావరణం నెలకొనేలా ప్రజల సహకారం ఎంతో అవసరమని, పోలీసు–ప్రజల సమన్వయంతో నేరాల నిర్మూలన సాధ్యమవుతుందని అన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తానని ఎస్ఐ షేక్ యాకూబ్ తెలిపారు. అనంతరం సిబ్బంది స్వాగతం పలికారు.

# తెలంగాణను గ్రీన్ ఎనర్జీ హబ్‌గా మారుస్తాం

- స్థానిక యువతకు భారీగా ఉపాధి అవకాశాలు
- తెలంగాణ రైజింగ్ 2047 విజన్ దిశగా ప్రభుత్వ పయనం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- షాబాద్‌లో 5.6 గిగావాట్ల ప్రీమియర్ ఎనర్జీస్ మెగా ప్లాంట్ ప్రారంభం
- 12 నెలల రికార్డు సమయంలో భారీ ప్రాజెక్టు పూర్తి: సీఎం ప్రశంస
- ఓఆర్ఆర్ లోపల కాలుష్య రహిత 'కోర్ అర్బన్ జోన్' ఏర్పాటు

**రంగారెడ్డి, జూలై 9 (సిరి న్యూస్):**

రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతికి, ముఖ్యంగా హరిత ఇంధన రంగానికి పెద్దపీట వేస్తూ, రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం సీతారాంపూర్‌లో 'ప్రీమియర్ ఎనర్జీస్' ఏర్పాటు చేసిన 5.6 గిగావాట్ల భారీ సోలార్ మాడ్యూల్స్ ప్లాంట్‌ను ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఘనంగా ప్రారంభించారు. కేవలం 12 నెలల స్వల్ప కాల వ్యవధిలోనే ఇంతటి భారీ గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టును పూర్తి చేయడం పట్ల ముఖ్యమంత్రి యాజమాన్యాన్ని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌లో భాగంగా రాష్ట్రాన్ని దేశంలోనే గ్రీన్ ఎనర్జీ హబ్‌గా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. హైదరాబాద్‌లోని ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న 2,100 చదరపు కిలోమీటర్ల ప్రాంతాన్ని కాలుష్య రహిత 'కోర్ అర్బన్ జోన్'గా మార్చడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ ప్లాంట్ ద్వారా సుమారు 2,500 నుండి 3,000 మంది స్థానిక యువతకు నేరుగా ఉపాధి లభిస్తుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ప్రీమియర్ ఎనర్జీస్ తయారు చేసిన సోలార్ పవర్డ్ స్ట్రీట్ లైట్లు, గాలిని శుద్ధి చేసే 'ఆక్సీట్రీ' వంటి



అత్యాధునిక ఉత్పత్తులను ముఖ్యమంత్రి, మంత్రులు స్వయంగా పరిశీలించారు. పర్యావరణ పరిరక్షణతో కూడిన పారిశ్రామికీకరణే తెలంగాణ అభివృద్ధికి పునాది అని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు మరియు సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలోనే ఆదర్శ మార్కెట్‌గా పటాన్‌చెరు యార్డు..

- రూ.21 కోట్లతో 172 దుకాణాలు..
- మేకల మండి, చేపల మార్కెట్ ఏర్పాటుకు కార్యాచరణ

**పటాన్‌చెరు, జూలై 9 (సిరి న్యూస్):**

పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్ యార్డును తెలంగాణలోనే ఆదర్శ మార్కెట్‌గా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనులు చేపడుతున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. గురువారం మార్కెట్ యార్డులో కొనసాగుతున్న అభివృద్ధి పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, రూ.21 కోట్ల వ్యయంతో 172 దుకాణాల నిర్మాణం శరవేగంగా



కొనసాగుతోందని తెలిపారు. పనులు పూర్తయ్యాక లైసెన్స్ పొందిన వ్యాపారులతో పాటు కొత్త వ్యాపారులకు కూడా దుకాణాలు కేటాయించి వ్యాపార విస్తరణకు అవకాశం కల్పిస్తామని చెప్పారు.భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని మార్కెట్ యార్డులో ఆధునిక మేకల మండి, చేపల మార్కెట్, అత్యాధునిక స్లాటర్ హౌస్, ఎస్‌టీపీ ప్లాంట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. అలాగే రోజువారీ కూరగాయల విక్రయాలు నిర్వహించే చిరు వ్యాపారుల కోసం ప్రత్యేక షెడ్లు నిర్మించి మెరుగైన సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు.మార్కెట్ అభివృద్ధికి దీర్ఘకాలిక ప్రణాళికను అమలు చేస్తూ రైతులు, వ్యాపారులు, వినియోగదారులకు మరింత మెరుగైన సౌకర్యాలు అందించేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, వ్యాపారుల సహకారంతో పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్ యార్డును తెలంగాణలోనే ఆదర్శ మార్కెట్‌గా తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మార్కెట్ కార్యదర్శి సునీల్, మాజీ డైరెక్టర్లు, బీఆర్ఎస్ నాయకులు, వ్యాపారులు, అధికారులు పాల్గొన్నారు..

# తిమ్మక్క చెరువుకు సరికొత్త వైభవం

- రూ.4.45 కోట్లతో సుందరీకరణ పనులు
- బతుకమ్మ ఘాట్, వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్‌తో అభివృద్ధి

**పటాన్‌చెరు, జూలై 9 (సిరి న్యూస్):**

పటాన్‌చెరు పట్టణంలోని తిమ్మక్క చెరువును రూ.4.45 కోట్ల వ్యయంతో ఆధునిక హంగులతో అభివృద్ధి చేస్తున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. గురువారం చెరువు వద్ద కొనసాగుతున్న సుందరీకరణ పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.అనంతరం మాట్లాడుతూ, చెరువు వద్ద వాకింగ్ ట్రాక్ నిర్మాణం తుది దశకు చేరుకుందని, త్వరలోనే బతుకమ్మ ఘాట్, ఓపెన్ జిమ్, స్వాగత తోరణాలు, విశ్రాంతి బెంచీలు, చిన్నారుల ఆట స్థలం, హరితవనం, ల్యాండ్‌స్కేపింగ్ తదితర అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ చెరువులను దశలవారీగా అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. తిమ్మక్క చెరువును ప్రజలకు ఆహ్లాదకరమైన విహార కేంద్రంగా తీర్చిదిద్ది, పట్టణానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిపేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ



మాజీ చైర్మన్ విజయ్ కుమార్, హెచ్ఎండీఏ డీఈ రామారావు, ఏపీఆర్ సంస్థ చైర్మన్ కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు

# ప్రైవేట్ స్కూళ్లపై నిఘా పెంచాలి.!

- విద్యాహక్కు చట్టం అమలుకు బీఎస్పీ డిమాండ్..
- ప్రైవేట్ పాఠశాలలపై కఠిన పర్యవేక్షణ కోరింపు..
- ఫీజులు, అనుమతులపై విచారణకు వినతి..
- మండల విద్యాధికారికి బీఎస్పీ వినతిపత్రం..

**మంచిర్యాల, జిల్లా ప్రతినిధి జూలై 09 (సిరి న్యూస్)**




విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా విద్యాహక్కు చట్టాన్ని కచ్చితంగా అమలు చేయడంతో పాటు ప్రైవేట్ పాఠశాలల అనుమతులు, మౌలిక వసతులు, ఫీజుల వసూళ్లపై సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని బహుజన్ సమాజ్ పార్టీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు ముల్కల్ల రాజేంద్రప్రసాద్ కోరారు.ఈ మేరకు మందమర్రి మండల విద్యాధికారి రాథోడ్ రమేష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. మండలంలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో ప్రభుత్వ నిబంధనలు పూర్తిస్థాయిలో అమలవుతున్నాయా లేదా అనే అంశాన్ని సమగ్రంగా పరిశీలించాలని, అనుమతులు లేకుండా నడుస్తున్న విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.అలాగే ప్రతి ప్రైవేట్ పాఠశాలలో ఫీజుల పట్టికను బహిరంగంగా ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు, భద్రతా ప్రమాణాలు, పరిశుభ్రమైన వాతావరణం కల్పించేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. విద్యాహక్కు చట్టం ప్రకారం అర్హులైన విద్యార్థులకు కల్పించాల్సిన సౌకర్యాలు ఎలాంటి లోపం లేకుండా అందేలా పర్యవేక్షించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. విద్య వ్యాపారంగా కాకుండా ప్రతి చిన్నారికి హక్కుగా అందాలని, విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించే విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ముల్కల్ల రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బహుజన్ సమాజ్ పార్టీ చెన్నూర్ నియోజకవర్గ అధ్యక్షుడు గాజుల శంకర్, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు ఎం.డి. మాతిన్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# కోదాడ ప్రగతిని జీర్ణించుకోలేకే ఆరోపణలు!

- మాజీ ఎమ్మెల్యే బొల్లం అసత్య ఆరోపణలు మానుకోవాలి.. రూ.1,938 కోట్ల అభివృద్ధిని ప్రజలు గమనిస్తున్నారు.
- కాంగ్రెస్ పార్టీ నాయకులు రాయపూడి వెంకటనారాయణ.

**కోదాడ, జూలై 09 (సిరి న్యూస్):**

కోదాడలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి నాయకత్వంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ఆధారరహిత ఆరోపణలు చేస్తూ తన ఉనికిని చాటుకునే ప్రయత్నం చేస్తున్నారని ఉమ్మడి నల్గొండ



జిల్లా మలిదశ ఉద్యమ కారుట సంక్షేమ సంఘం కాంగ్రెస్ పార్టీ నాయకులు రాయపూడి వెంకటనారాయణ విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ అసత్య ఆరోపణలు మానుకుని ప్రజా సమస్యలపై మాట్లాడాలని హితవు పలికారు. గురువారం ఆయన మాట్లాడుతూ.....గత 30 నెలల్లో కోదాడ నియోజకవర్గానికి వివిధ శాఖల ద్వారా రూ.1,938.41 కోట్ల విలువైన అభివృద్ధి, సంక్షేమ పనులు మంజూరయ్యాయని తెలిపారు. సాగునీటి ప్రాజెక్టులు, కాలువల ఆధునీకరణకు రూ.181.50 కోట్లు, ఆర్అండ్‌బీ రోడ్లు, వంతెనలు, భవనాల నిర్మాణానికి రూ.292.67 కోట్లు, పంచాయతీరాజ్ రోడ్ల అభివృద్ధికి రూ.239.86 కోట్లు, ప్రజారోగ్యం, మున్సిపల్ మౌలిక సదుపాయాలకు రూ.360.47 కోట్లు, విద్యా రంగానికి రూ.253 కోట్లు కేటాయించి కోదాడ అభివృద్ధికి బలమైన పునాది వేశారని పేర్కొన్నారు.ఇందిరమ్మ గృహ పథకం కింద 1,031 ఇళ్ల నిర్మాణానికి రూ.51.50 కోట్లు మంజూరయ్యాయని, రైతు సంక్షేమంలో భాగంగా 31,461 మంది రైతులకు రూ.211.17 కోట్ల రుణమాఫీతో పాటు రైతు భరోసా, రైతు బీమా పథకాలను సమర్థవంతంగా అమలు చేశారని చెప్పారు. అలాగే జవహర్ నవోదయ పాఠశాల, యంగ్ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్, అమ్మ ఆదర్శ పాఠశాలల అభివృద్ధితో పాటు కోదాడలో 100 పడకల ఆసుపత్రి, సబ్‌సెంటర్ భవనాలు, సీటీ స్కాన్ మిషన్ ఏర్పాటు ద్వారా వైద్య సేవలు మెరుగుపడ్డాయని వివరించారు.కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాలు రాష్ట్రంలో అభివృద్ధిలో ముందంజలో నిలుస్తుంటే దానిని జీర్ణించుకోలేక మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ అసత్య ఆరోపణలు చేస్తున్నారని రాయపూడి వెంకటనారాయణ ఆరోపించారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి నాయకత్వంలో కోదాడ అభివృద్ధి ఇదే వేగంతో కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.

# కూలే హాస్టల్.. చదువులే సవాల్.!..

- శిథిల హాస్టల్‌లో 70 మంది విద్యార్థులు.. ప్రాణభయంతో చదువులు!..
- వెంటనే కొత్త భవనం నిర్మించాలి.. తహసీల్దార్‌కు బీజేపీ వినతి..

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూలై 09 (సిరి న్యూస్)**

కోటపల్లి మండల కేంద్రంలోని ఎస్సీ వసతి గృహ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో అందులో నివసిస్తున్న సుమారు 70 మంది విద్యార్థులు నిత్యం ప్రాణ భయంతోనే విద్యాభ్యాసం కొనసాగిస్తున్నారని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర గౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఎప్పుడు భవనం కూలిపోతుందో తెలియని పరిస్థితుల్లో విద్యార్థులు వసతి గృహంలో ఉండాల్సి రావడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. మండల నాయకుల ఆహ్వానం మేరకు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దుర్గం అశోక్‌తో కలిసి వసతి గృహాన్ని సందర్శించిన నాయకులు భవనం పరిస్థితిని పరిశీలించారు. గోడలు పగుళ్లతో, పైకప్పు శిథిలమై ప్రమాదకరంగా మారిందని, ఇలాంటి పరిస్థితుల్లో విద్యార్థులను అక్కడే ఉంచడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. విద్యార్థుల ప్రాణాలకు ఎలాంటి ప్రమాదం జరగకముందే ప్రభుత్వం అత్యవసర చర్యలు తీసుకుని, వెంటనే నూతన ఎస్సీ వసతి గృహ భవనాన్ని నిర్మించాలని వారు డిమాండ్ చేశారు. అంతవరకు విద్యార్థులకు సురక్షితమైన ప్రత్యామ్నాయ వసతి కల్పించాలని కోరారు. అనంతరం



మండల తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసి, శిథిల భవనంపై వెంటనే అధికారులతో పరిశీలన నిర్వహించి, విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

# కార్యకర్తల సంక్షేమమే బిఆర్ఎస్ లక్ష్యం..

- ఉపాధి కోల్పోయిన కార్యకర్తకు అండగా ఉంటాం..
- మున్సిపల్ ఎన్నికల సమయంలో హబీబ్ ఆటోను దగ్ధం చేసిన దుండగులు.
- జీవనోపాధి కోల్పోయిన హబీబ్ కు ఆటో కొనుగోలు చేసిన పద్మా దేవేందర్‌రెడ్డి..
- మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు చేతుల మీదుగా వాహన పత్రాలు అందజేత..

**మెదక్,జూలై, 09(సిరి న్యూస్)**

మెదక్ మున్సిపల్ ఎన్నికల వేళ దుండగుల దాడిలో ఆటో కోల్పోయి జీవనోపాధి లేక ఇబ్బందులు పడుతున్న బీఆర్ఎస్ కార్యకర్త హబీబ్‌కు మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా



దేవేందర్‌రెడ్డి అండగా నిలిచారు. బాధితుడి పరిస్థితిని గుర్తించి స్వయంగా ఆటోను కొనుగోలు చేసి, ఇన్సూరెన్స్‌తో పాటు అన్ని అవసరమైన వాహన పత్రాలను పూర్తి చేయించారు. దీంతో హబీబ్‌కు తిరిగి జీవనోపాధి లభించింది.ఈ నేపథ్యంలో గురువారం మాజీ మంత్రి హరీశ్‌రావు నివాసంలో జరిగిన కార్యక్రమంలో మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్, మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లికార్జున్ తదితరులు హబీబ్‌కు ఆటో వాహన పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ..పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలకు కష్టకాలంలో అండగా నిలవడం తమ బాధ్యత అని అన్నారు.ఎన్నికల సమయంలో ఆటో దగ్ధమై జీవనోపాధి కోల్పోయిన హబీబ్‌కు మళ్లీ ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో పద్మా దేవేందర్‌రెడ్డి ఆటోను కొనుగోలు చేసి అందించారని తెలిపారు.తనకు ఆటోను అందించి జీవనోపాధిని పునరుద్ధరించిన పద్మా దేవేందర్‌రెడ్డి, హరీశ్‌రావుతో పాటు పార్టీ నాయకత్వానికి హబీబ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ కన్వీనర్ గడ్డమీద కృష్ణగౌడ్, యువ నాయకుడు జీవన్‌రావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గంగా నరేందర్, మున్సిపల్ కౌన్సిలర్లు బట్టి ఉదయ్‌కుమార్, జుబేర్ అహ్మద్, దీపక్ కుమార్, మాజీ కౌన్సిలర్ మాయ మల్లేశం, నాయకులు సాయి, కసాపురం కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ పోచమ్మ తల్లి ఆలయ సన్నిధిలో.

- బిఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ గౌడ్

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి జూలై9 సిరి న్యూస్**

జగద్గిరిగుట్ట డివిజన్ సంజయ్ పురి కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీ పోచమ్మ దేవాలయంలో నిర్వహించిన అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ఆయన మాట్లాడుతూ..భక్తి ఉన్న చోట పోచమ్మ తల్లి కరుణ ఆశీర్వాదాలు ప్రజలకు ఎల్లప్పుడూ ఉంటుందని, అమ్మవారి కృపా కటాక్షాలు భక్తులందరిపై . నియోజకవర్గ ప్రజలందరికీ ఎల్లప్పుడు ఉంటాయని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగన్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, ఆలయ కమిటీ చైర్మన్ రేగూరి ప్రవీణ్ గుప్తా, అధ్యక్షుడు గుంటుక శ్రీకాంత్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నైనొల్ల లక్ష్మణ్, కోశాధికారి పున్న వెంకటేష్ (కోల్గేట్), కోశాధికారి వడ్లప్పు రాము, ఆలయ నిర్వహణ కార్యదర్శి సహ మాతూరి వాసు, పుల్లరి రాజు, బరిగె గణేష్, సలహా బృందం అధ్యక్షులు అరుణ్ రెడ్డి, ఎండి. షౌకత్ పాషా,మాజీ



అధ్యక్షులు అప్పల శ్రీనివాసరావు, ముప్పాల వెంకటేశ్వరులు, వేముల టైలర్ రాములు కార్యనిర్వాహక కమిటీ సభ్యులు నెమూరి సాయికిరణ్,మాదాసు రాజు, కోపూరి కృపాకర్, అరవింద్, సీనియర్ నాయకులు మల్లేష్ గౌడ్, పాపిరెడ్డి, గిరి, బస్వేశ్వర్, జయకృష్ణ, సన్నీ, స్టాలిన్ పాల్గొన్నారు.

# టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర అధ్యక్షుడు విరాహాత్ అలీకి ఘన స్వాగతం

- ముత్తంగి నుంచి భారీ ర్యాలీగా సంగారెడ్డి జిల్లా మహాసభకు తరలిన జర్నలిస్టులు

**పటాన్‌చెరు, జూలై 9 (సిరి న్యూస్):**

తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే–ఐజేయూ) రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీకి పటాన్‌చెరు నియోజకవర్గ జర్నలిస్టులు ఘన స్వాగతం పలికారు. సంగారెడ్డి జిల్లా మహాసభకు హాజరయ్యేందుకు వెళ్తున్న సందర్భంగా ముత్తంగి వద్ద పెద్ద ఎత్తున తరలి వచ్చిన జర్నలిస్టులు పూలమాలలు వేసి, శాలువాతో సత్కరించి ఆత్మీయంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా విరాహత్ అలీ మాట్లాడుతూ, జిల్లా మహాసభలు సంఘాన్ని









మరింత బలోపేతం చేయడంతో పాటు యువ జర్నలిస్టులకు దిశానిర్దేశం చేసే వేదికలుగా నిలుస్తాయని అన్నారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా జర్నలిస్టులు తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. డిజిటల్ మీడియా విస్తరిస్తున్న ఈ కాలంలో బాధ్యతాయుతమైన జర్నలిజానికి మరింత ప్రాధాన్యం పెరిగిందని, ఐక్యతతో ముందుకు సాగితేనే జర్నలిస్టుల హక్కులను సమర్థవంతంగా సాధించగలమని పిలుపునిచ్చారు.అనంతరం పటాన్‌చెరు నియోజకవర్గానికి చెందిన జర్నలిస్టులు టీయూడబ్ల్యూజే–ఐజేయూ జెండాలు, బ్యానర్లతో భారీ వాహన ర్యాలీగా సంగారెడ్డి జిల్లా కేంద్రానికి బయలుదేరి జిల్లా మహాసభలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే నాయకులు అనిల్, శ్రీనాథ్, శ్రీనివాస్ రెడ్డి, నర్సింహా, రాజు, శ్రీనివాస్, ప్రభాకర్‌తో పాటు పటాన్‌చెరు నియోజకవర్గానికి చెందిన సీనియర్, యువ జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నిందితునికి జీవిత ఖైదు

- బంగారు గుండ్ల కోసం వృద్ధురాలిని హత్య చేసిన నిందితుడికి జీవిత ఖైదు, రూ.6 వేల జరిమానా.
- శిక్ష పడేందుకు కృషి చేసిన సిబ్బందిని అభినందించిన మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు,

**మెదక్ జూలై 09(సిరి న్యూస్)**





మెదక్ జిల్లా టేక్మాల్ మండలం ఖాద్లూర్ గ్రామానికి చెందిన శివకుమార్ (28) బంగారు గుండ్ల కోసం ఓ వృద్ధురాలిని గొంతు పిసికి హత్య చేసిన కేసులో జిల్లా న్యాయస్థానం జీవిత ఖైదుతో పాటు రూ.6 వేల జరిమానా విధించినట్లు మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు.ఖాద్లూర్ గ్రామ శివారులోని దత్తాత్రేయ ఆశ్రమాన్ని నిర్వహిస్తూన్న 75 ఏళ్ల అంజమ్మను 2024 ఆగస్టు 7న గొంతు పిసికి హత్య చేసి, ఆమె ధరించిన బంగారు గుండ్లను అపహరించినట్లు తేలింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు టేక్మాల్ ఏఎస్ఐ దయానంద్ కేసు నమోదు చేశారు. దర్యాప్తు అధికారులు సీఐలు రాజశేఖర్ రెడ్డి, రేణుక రెడ్డి సమగ్రంగా విచారణ చేపట్టి పక్కా సాక్ష్యాధారాలను సేకరించి న్యాయస్థానంలో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. విచారణ సందర్భంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేష్ బలమైన వాదనలు వినిపించారు. పూర్తి సాక్ష్యాధారాలను పరిశీలించిన మెదక్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ నిందితుడు శివకుమార్‌ను దోషిగా తేల్చి జీవిత ఖైదుతో పాటు రూ.6 వేల జరిమానా విధించినట్లు మెదక్ జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ కేసు దర్యాప్తులో టేక్మాల్ ఎస్ఐ అరవింద్, లైజనింగ్ అధికారి ఎస్ఐ విఠల్, కానిస్టేబుల్ రవీందర్ గౌడ్, సీడీఓ కృష్ణ సహకరించారు. ఈ కేసును విజయవంతంగా దర్యాప్తు చేసి నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన దర్యాప్తు అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్, పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు అభినందించారు.

# అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవానికి

## బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ గౌడ్



**కుత్బుల్లాపూర్ ప్రతినిధి జూలై 9 సిరి న్యూస్**

షాపూర్ నగర్ ప్రధాన.రహదారిలోని పోచమ్మ తల్లి దేవాలయంలో నిర్వహించిన అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవానికి బిఆర్ఎస్ ఎల్పివిప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. అమ్మవారి దయ ఉంటే అన్నీ ఉన్నట్లేనని, అమ్మవారి కృప నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో అష్ట ఐశ్వర్యాలతో నియోజకవర్గ ప్రజలందరూ సుఖ సంతోషాలతో నిండు నూరేళ్లు భక్తులందరిపై వారి కృప ఉండాలని మాట్లాడారు ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు మంత్రి సత్యనారాయణ, సురేష్ రెడ్డి, బట్ట పాలకృష్ణ, డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, పోలే శ్రీకాంత్, సీనియర్ నాయకులు మదన్ గౌడ్, సదానందం గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు కృష్ణ గౌడ్, రాజు, వెంకన్న, నాయకులు కొండకల్ల శ్రీనివాస్, కోల శ్రీకాంత్ ముదిరాజ్, షేక్ సాజిద్ పాల్గొన్నారు.

# ఫస్ట్ లుక్ మెన్స్ వేర్ ను ప్రారంభించిన

## బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ గౌడ్

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి జులై 9 సిరి న్యూస్**



సూరారం చౌరస్తా వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ఫస్ట్ లుక్ మెన్స్ వేర్ ను బిఆర్ఎస్ ఎల్పి విప్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సరికొత్త డిజైన్లు, నూతన కలెక్షన్లతో వినియోగదారులను ఆకట్టుకుంటూ ఫస్ట్ లుక్ మంచి ఆదరణను పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫస్ట్ లుక్ మెన్స్ వేర్ నిర్వాహకులు ఉప్పాడ పెద్దిరాజు, దుర్గా, మాజీ కార్పొరేటర్లు సురేష్ రెడ్డి, మంత్రి సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, పోలే శ్రీకాంత్,సీనియర్ నాయకులు దేవేందర్, కొండకల్ల శ్రీనివాస్ రెడ్డి, కోల శ్రీకాంత్ ముదిరాజ్, వెంకట్ రెడ్డి, శ్రీనివాస్ రాజు, రాంరెడ్డి, శివ గౌడ్, కుమ్మరి చందు, ఆంజనేయులు, పాల్గొన్నారు.

# చిరాన్ అడ్వాన్స్డ్ కేర్ హాస్పిటల్ ను ప్రారంభించిన

## ఎమ్మెల్యే వివేకానంద గౌడ్

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి జూలై9 సిరి న్యూస్**



జీడిమెట్ల డివిజన్ బ్యాంక్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన చిరాన్ అడ్వాన్స్డ్ కేర్.హాస్పిటల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై హాస్పిటల్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బ్యాంక్ కాలనీ పరిసర ప్రాంత ప్రజలకు అత్యధిక వైద్య సేవలను అందుబాటులోకి తెస్తూ హాస్పిటల్ ను ఏర్పాటు అభినందనీయమన్నారు. నిత్యం హాస్పిటల్స్ సిబ్బంది అందుబాటులో ఉండే ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు ఈ కార్యక్రమంలో డాక్టర్ సునీల్, డాక్టర్ మాధురి, నాయకులు సుధాకర్ గౌడ్, కుంట సిద్ధిరాములు, దేవరకొండ శ్రీనివాస్, సత్తిరెడ్డి, కిషోర్ చారి, శివ, విజయ్ కుమార్ పాల్గొన్నారు.



## వర్షంలో 12 గంటలపాటు ఏకబిగిన

# చిరు షూటింగ్

### మైసా కోసం అండర్ వాటర్‌లో రష్మిక సాహసం

ప్రేక్షకులను అలరించడం కోసం నటీనటులు ఎంత కష్టాన్నైనా భరిస్తారు. పాత్ర కోసం ఎంత రిస్క్ అయినా తీసుకుంటారు. ప్రస్తుతం సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాల్లో చిరంజీవి హీరోగా రానున్న మెగా 158 ఒకటైతే.. రష్మిక ప్రధానపాత్రలో తెరకెక్కుతోన్న 'మైసా' మరొకటి. ఈ చిత్రాల కోసం అటు చిరు.. ఇటు రష్మిక ఎంతో కష్టపడుతున్నారు. తాజాగా ఈ రెండు సినిమాల అప్‌డేట్స్‌ను ఆయా చిత్రబృందాలు పంచుకున్నాయి. మెగా 158లో వర్షంలో సీక్వెన్స్ కోసం చిరంజీవి 12 గంటలు ఏకధాటిగా షూటింగ్ చేయగా.. 'మైసా' కోసం రష్మిక అండర్ వాటర్ సీక్వెన్స్‌ను పూర్తి చేశారు. చిరంజీవి హీరోగా బాబీ దర్శకత్వంలో మెగా158 (వర్కింగ్ టైటిల్) తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. ప్రస్తుతం హైదరాబాద్‌లో వేసిన ఓ భారీ సెట్‌లో యాక్షన్ సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. ఉదయం 4 గంటలకు వ్యాయామంతో తన రోజును ప్రారంభించే చిరంజీవి నిబద్ధత చూసి మా చిత్రబృందం ఆశ్చర్యపోయింది. అత్యంత కఠినమైన యాక్షన్ సన్నివేశాలను షూట్ చేయడం కోసం 12 గంటలు పట్టింది. వర్షంలో ఉండే ఈ సన్నివేశాన్ని చిరు ఎంతో కష్టపడి పూర్తి చేశారు. అందుకే ఆయన మెగాస్టార్ అయ్యారు అని టీమ్ పోస్ట్ చేసింది.'మైసా' కోసం మునుపెన్నడూ లేనివిధంగా రష్మిక శ్రమిస్తున్నారని దర్శకుడు రవీంద్ర పుల్లె తెలిపిన విషయం తెలిసిందే. యదార్థ సంఘటనల ఆధారంగా రూపొందుతోన్న ఈ చిత్రంలో ఆమె.. గోండు తెగకు చెందిన మహిళగా కనిపించనున్నారు. ఈ సినిమా కోసం సవాలుతో కూడిన స్టంట్స్ చేసిన నటి.. తాజాగా అండర్ వాటర్ సీక్వెన్స్‌ను పూర్తి చేశారు. సినిమాలో ఈ సన్నివేశం చాలా ఆసక్తిగా ఉంటుందని టీమ్ వెల్లడించింది. ఈ చిత్రం కోసం అంతర్జాతీయ స్టంట్ కొరియోగ్రాఫర్ కెచా ఖంపక్డీ ఆధ్వర్యంలో రష్మిక శిక్షణ పొందారు.

# జన నాయగన్ విడుదలకు సిద్ధం

విజయ్ 'జన నాయగన్' కోసం అభిమానులు ఎన్నో నెలల నుంచి ఎదురుచూస్తున్న సంగతి తెలిసిందే. సెన్సార్ సర్టిఫికెట్ ఆలస్యం కారణంగా నిలిచిపోయిన ఈ చిత్రం.. ఈ నెలలోనే విడుదల కావడం దాదాపు ఖాయంగానే కన్పిస్తోంది. దీనిపై కెనడా డిస్ట్రిబ్యూటర్ హింట్ ఇవ్వడంతో మరోసారి విడుదల తేదీపై చర్చ మొదలైంది. కెనడాకు చెందిన ప్రముఖ డిస్ట్రిబ్యూటర్ యార్క్ సినిమాస్ సోషల్ మీడియా వేదికగా ఓ పోస్ట్ చేసింది. 'ఎట్టకేలకు మన దళపతి విజయ్ 'జన నాయగన్' సినిమాతో వెండితెరపై మెరిసేందుకు సిద్ధమయ్యారు. జులై 24 నుంచి కెనడాలో యార్క్ సినిమాస్ ఈ చిత్రాన్ని గ్రాండ్‌గా విడుదల చేస్తోంది' అంటూ ఓ పోస్టర్ పంచుకుంది. త్వరలోనే టికెట్ బుకింగ్స్ కూడా ఓపెన్ అవుతాయని తన పోస్ట్‌లో తెలిపింది. దీంతో ఈ తేదీకి రావడం దాదాపుగా ఖాయమైనట్లు తెలుస్తోంది. ఇక, దీనికి ఒక రోజు ముందుగానే భారత్‌లోనూ విడుదలయ్యే అవకాశాలు కన్పిస్తున్నాయి. సెన్సార్ బోర్డు సూచించిన మార్పులకు చిత్రబృందం అంగీకరించింది. రెండు రోజుల్లో సెన్సార్ సర్టిఫికెట్ వస్తుందని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ఈ పనులు పూర్తికాగానే చిత్ర నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ విడుదల తేదీని అధికారికంగా ప్రకటించనుంది. ఓవర్సీస్ డిస్ట్రిబ్యూటర్లకు జులై 24 విడుదలకు సిద్ధంగా ఉండాలని ఇప్పటికే సమాచారం అందినట్లు తెలుస్తోంది.




# నేడు విడుదలవుతున్న ..లెనిన్

### మరికొన్ని డబ్బింగ్ మూవీలు కూడా సందడి

ఈ నెల రెండో శుక్రవారం బాక్సాఫీస్ వద్ద సరికొత్త చిత్రాల సందడి నెలకొనబోతోంది. ఈ వారం టాలీవుడ్ నుంచి అఖిల్ అక్కినేని మోస్ట్ అవేటెడ్ యాక్షన్ డ్రామా 'లెనిన్' నేరుగా థియేటర్లలోకి వస్తుండగా, దీనికి పోటీగా భారీ సంఖ్యలో డబ్బింగ్ సినిమాలు కూడా రేసులో నిలిచాయి. ఇక వైవిధ్యమైన కథాంశాలతో, విభిన్న జోనర్లలో ప్రేక్షకులను అలరించేందుకు ఆసక్తికరమైన చిత్రాలు విడుదలవుతున్నాయి. అఖిల్ అక్కినేని కెరీర్‌లోనే అత్యంత రగ్గడ్ లుక్‌లో కనిపించనున్న యాక్షన్ డ్రామా 'లెనిన్'. మురళి కిషోర్ అబ్బురు దర్శకత్వంలో రాయలసీమ నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. ఒక అందమైన ప్రేమకథ హింసాత్మక మలుపులు తిరిగితే ఎలా ఉంటుందనే కథాంశంతో వస్తున్న ఈ సినిమాను నాగార్జున అక్కినేని, సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మించారు. థమన్ ఎస్ దీనికి సంగీతం అందించారు. ఇకపోతే మైథాలజీ మరియు యాక్షన్ ఎలిమెంట్స్‌తో వస్తోన్న చిత్రం 'వాసుదేవ సుతం'. పూరీ జగన్నాథ ఆలయంలో దాగి ఉన్న ఒక పవిత్రమైన శక్తిని రక్షించడానికి ఒక యువకుడు చేసే పోరాటమే ఈ సినిమా కథ. మాస్టర్ మహేంద్రన్, అంబికా వాణి, సుమేధా బజాజ్ ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రానికి వైకుంఠ్ బోను దర్శకత్వం వహించగా, మణిశర్మ సంగీతాన్ని సమకూర్చారు.ఇకపోతే మలయాళంలో విడుదలై తెలుగులో రాబోతున్న సస్పెన్స్ థ్రిల్లర్ 'ఐ, నోబడీ'. నిసామ్ బషీర్ దర్శకత్వంలో పృథ్వీరాజ్ సుకుమారన్, పార్వతి తిరువోతు ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రం, ఒక భారీ బ్యాంక్ దోపిడీ కేసులో అన్యాయంగా ఇరుక్కున్న ఒక సాధారణ వ్యక్తి తన నిర్దోషిత్వాన్ని ఎలా నిరూపించు కున్నాడు అనే కథతో సాగుతుంది. తమిళ రొమాంటిక్ కామెడీ చిత్రం 'లవ్ ఓ లవ్' కూడా నేడు తెలుగు ప్రేక్షకులను పలకరించనుంది. మహేష్ రాజేంద్రన్ దర్శకత్వంలో పవిష్ నారాయణన్, నాగ దుర్గ, ఆదిత్య కతిర్ నటించిన ఈ సినిమా, అప్పుల్లో మునిగిపోయిన ఒక యువకుడి ప్రేమకథ చుట్టూ తిరుగుతుంది. ఇందులో ప్రముఖ దర్శకులు సెల్వరాఘవన్, కె. ఎస్. రవికుమార్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు.ప్రేమ, బ్రేకప్ మరియు గుండె లోతుల్లోని భావాల సమాహారంగా వస్తోన్న భావోద్వేగభరిత చిత్రం 'హృదయం మురళి'. అథర్వ మురళి, ప్రీతి ముకుందన్ జంటగా ఆకాష్ భాస్కరన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో కాయాదు లోహర్, నిహారిక ఎన్.ఎమ్ ఇతర పాత్రలు పోషించారు. తమిళంలో 'ఇదయం మురళి'గా, తెలుగులో 'హృదయం మురళి'గా ఈ సినిమా రిలీజ్ కానుంది. బాలీవుడ్ నుంచి నవ్వుల పండగను తీసుకురావడానికి 'ధమాల్ 4' వస్తోంది. ఇంద్ర కుమార్ దర్శకత్వంలో అజయ్ దేవగన్, రితీష్ దేశ్‌ముఖ్, అర్షద్ వార్సి, జావేద్ జాఫేరి, సంజయ్ మిశ్రా, రవి కిషన్ కలయికలో వస్తోన్న ఈ క్రేజీ కామెడీ ఎంటర్‌టైనర్ ప్రేక్షకులను నవ్వించడానికి సిద్ధమైంది. ఇలా విభిన్నమైన జోనర్లతో, భారీ సంఖ్యలో డబ్బింగ్ సినిమాలతో ఈ శుక్రవారం బాక్సాఫీస్ కళకళలాడబోతోంది.




# మరో సస్పెన్స్ థ్రిల్లర్.. వదల




సీనియర్ నటుడు జగపతిబాబు ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న సైకలాజికల్ థ్రిల్లర్ 'వదల' విడుదలకు సిద్ధమవుతోంది. దర్శకుడు అకెళ్ల వి. కృష్ణ తెరకెక్కించిన ఈ చిత్రం ఈ నెల 17వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానుండగా, ప్రస్తుతం చిత్ర బృందం ప్రమోషన్లను వేగవంతం చేసింది. ఈ నేపథ్యంలో తాజాగా విడుదలైన ట్రైలర్ సినిమాపై ఒక్కసారిగా అంచనాలను పెంచేసింది. ఈ చిత్రంలో లయ కథానాయికగా నటించగా, హృతిక శ్రీనివాస్ అత్యంత కీలక పాత్రలో కనిపించనున్నారు. కిషోర్ నాయుడు చిరుమామిళ్ల, తమ్మారెడ్డి భరద్వాజ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ట్రైలర్‌ను గమనిస్తే, మొదట ఒక సాధారణ కుటుంబ కథలా సినిమా ప్రారంభమవుతుంది. ఇరవై ఏళ్లుగా సంతోషకరమైన దాంపత్య జీవితాన్ని గడుపుతున్న దంపతులుగా జగపతిబాబు, లయ కనిపిస్తారు. ఒకరిపై ఒకరికి అపారమైన ప్రేమ, ఆప్యాయతతో జీవిస్తున్న వారి జీవితంలోకి అనూహ్యంగా ఓ యువతి ప్రవేశించడం కథను పూర్తిగా మలుపుతిప్పుతుంది. పక్కింటికి వచ్చిన ఆ యువతి జగపతిబాబు పాత్రపై ప్రమాదకరమైన స్థాయిలో మోజు పెంచుకోవడం, క్రమంగా అది వ్యామోహంగా మారడం ట్రైలర్‌లో ఆసక్తికరంగా చూపించారు. అదే సమయంలో లయ పాత్రకు గుర్తు తెలియని వ్యక్తుల నుంచి బెదిరింపులు రావడం, కుటుంబంపై ముప్పు పెరగడం కథలోని సస్పెన్స్‌ను మరింత పెంచుతోంది. ఈ చిత్రంలో కుటుంబాన్ని కాపాడుకోవడానికి పోరాడే వ్యక్తిగా జగపతిబాబు కనిపిస్తున్నారు. కుటుంబ బాధ్యతలు, అనుకోని ప్రమాదం మధ్య చిక్కుకున్న వ్యక్తి పాత్రలో ఆయన నటన ట్రైలర్‌లోనే ఆకట్టుకుంటోంది. లయ కూడా సహజమైన నటనతో కుటుంబ భావోద్వేగాలను బలంగా ఆవిష్కరించినట్లు కనిపిస్తోంది. మరోవైపు హృతిక శ్రీనివాస్ పోషించిన పాత్ర ట్రైలర్‌కే ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఆమె హావభావాలు, డైలాగ్ డెలివరీ, బాడీ లాంగ్వేజ్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతున్నాయి. దర్శకుడు అకెళ్ల వి. కృష్ణ మరోసారి థ్రిల్లర్ జానర్‌పై తన పట్టు చూపించినట్లు ట్రైలర్ స్పష్టం చేస్తోంది. కథలో ఎక్కడా సస్పెన్స్ తగ్గకుండా, అదే సమయంలో కుటుంబ భావోద్వేగాలను కూడా సమతుల్యంగా చూపించే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఆ యువతి అసలు ఉద్దేశం ఏమిటి? ఆమె జగపతిబాబు జీవితంలోకి ఎందుకు వచ్చింది? ఈ సంఘటనల వెనుక అసలు నిజం ఏమిటి? అనే ప్రశ్నలకు సమాధానం తెలుసుకోవాలనే ఆసక్తిని ట్రైలర్ చివరి వరకు కొనసాగిస్తుంది. ఈ చిత్రానికి ప్రముఖ సినిమాటోగ్రాఫర్ చోటా కె. నాయుడు అందించిన విజువల్స్ థ్రిల్లర్ మూడ్‌ను మరింత బలపరిచాయి. డార్క్ టోన్స్, విజువల్ ఫ్రేమింగ్ కథలోని ఉత్కంఠను పెంచేలా ఉన్నాయి. సంగీత దర్శకుడు కార్తీక్ కోడకండ్ల అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ప్రతి సన్నివేశానికి అదనపు థ్రిల్‌ను జోడించింది.

# భారీ బడ్జెట్ చిత్రంగా టాక్సిస్

కేజీఎఫ్' సిరీస్‌తో పాన్ ఇండియా స్టార్‌గా ఎదిగిన యశ్ ప్రస్తుతం నటిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం 'టాక్సిక్'. మలయాళ దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ తెరకెక్కిస్తున్న ఈ సినిమా ప్రారంభం నుంచే భారీ అంచనాలు నెలకొల్పింది. పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రాన్ని అత్యున్నత నిర్మాణ విలువలతో రూపొందిస్తున్నారు. సినిమా నిర్మాణ వ్యయం దాదాపు రూ.500 కోట్లకు పైగా ఉంటుందని ఇండస్ట్రీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. యాక్షన్, హింసాత్మక నేపథ్యం, భారీ విజువల్స్‌తో రూపొందుతున్న ఈ చిత్రం పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. ఇప్పటికే విడుదలైన రెండు గ్లింప్స్‌తో పాటు ఒక పాటకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించింది. తాజాగా ఈ సినిమా బడ్జెట్‌కు సంబంధించిన మరో ఆసక్తికర విషయం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ప్రచారం ప్రకారం, మొత్తం బ్జడెట్‌లో దాదాపు రూ.100 కోట్లు ప్రధాన తారాగణం, దర్శకురాలు, కీలక సాంకేతిక నిపుణుల రెమ్యూనరేషన్లకే వెచ్చిస్తున్నట్లు తెలుస్తోంది. హీరో యశ్ ఈ సినిమా కోసం సుమారు రూ.50 కోట్ల పారితోషికం తీసుకుంటున్నారని, అంతేకాకుండా సినిమా లాభాల్లో కూడా వాటా ఉండేలా ఒప్పందం చేసుకున్నారని సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఇక చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్న కియారా అద్వానీకి సుమారు రూ.15 కోట్లు పారితోషికంగా అందుతున్నట్లు సమాచారం. కీలక పాత్రలో కనిపించనున్న నయనతారకు రూ.12 కోట్లు, మరో ముఖ్యమైన పాత్రలో నటిస్తున్న రుక్మిణి వసంత్‌కి రూ.3 కోట్లు ఇస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. అలాగే తారా సుతారియా, హ్యూమా ఖురేషిలకు చెరో రూ.2 కోట్ల వరకు పారితోషికం చెల్లిస్తున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. దర్శకురాలు గీతూ మోహన్‌దాస్‌తో పాటు ఇతర కీలక సాంకేతిక నిపుణుల పారితోషికాలు కలిపితే మొత్తం రెమ్యూనరేషన్ వ్యయం రూ.100 కోట్ల మార్క్‌ను దాటే అవకాశముందని చర్చ జరుగుతోంది. కేవలం నటీనటుల పారితోషికాలే కాకుండా సినిమా నిర్మాణంపైనా భారీగా ఖర్చు చేస్తున్నట్లు తెలుస్తోంది. పీరియాడిక్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి భారీ సెట్లు, ప్రత్యేక ఆర్ట్ డైరెక్షన్, అత్యాధునిక విజువల్ ఎఫెక్ట్స్ ప్రధాన ఆకర్షణలుగా ఉండనున్నాయి. అందుకే ఆర్ట్ డిపార్ట్‌మెంట్, యాక్షన్ సీక్వెన్స్‌లు, సాంకేతిక అంశాలపై కూడా నిర్మాతలు భారీగా పెట్టుబడి పెడుతున్నట్లు సమాచారం



The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY, editor BADHE JAYASHREE.